ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి: ఎస్పీ

అనకాపల్లి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయనున్న మండపాలు, పందిళ్లకు పోలీసు శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలు నిర్వహించే వారు తొలుత ఒక కమిటీగా ఏర్పడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్‌విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలన్నారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్పీ పేర్కొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు

- ఇప్పటి వరకు ఉన్న కార్డుల స్థానంలో కొత్తవి జారీ
- ఈ నెల 25 నుంచి పంపిణీ
- జిల్లాలో 5.4 లక్షల బియ్యం కార్డులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇప్పటి వరకు వున్న రేషన్ కార్డుల స్థానంలో నూతన కార్డులు రానున్నాయి. ఈ నెల 25వ తేదీ నుంచి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డును ప్రభుత్వం జారీ చేసింది. జిల్లాలో 5.3 లక్షలపైచిలుకు బియ్యం కార్డులు వున్నాయి. వీటితోపాటు కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న 12,759 మందిలో అర్హత పొందిన 9,369 మందికి కూడా స్మార్ట్ రేషన్ కార్డులు అందజేయనున్నారు. స్మార్ట్ రేషన్ కార్డుపై కుటుంబ పెద్ద ఫొటో, పూర్తి వివరాలతోపాటు కుటుంబ సభ్యుల పేర్లు వుంటాయి. క్యూఆర్ కోడ్ ద్వారా డైనమిక్ కీ రిజిస్టర్‌తో వీటిని అనుసంధానం చేయనున్నారు. కార్డు ద్వారా జరిగే ప్రతి లావాదేవీ కేంద్ర కార్యాలయంలో నమోదు అయ్యేలా కార్డులు రూపొందిస్తున్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల వివరాలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగానే జిల్లాలో కార్డులు పంపిణీ చేయనునట్టు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మూర్తి తెలిపారు. కాగా కొత్త రేషన్ కార్డుల జారీ కోసం సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు.



నమూనా స్మార్ట్ రేషన్ కార్డు

ఉప్పుటేరులో మత్స్యఘోష

- సెజ్ పరిశ్రమల కాలుష్యంతో చేపలు మృత్యువాత
- అధికారులు పట్టించుకోవడం లేదని మత్స్యకారుల ఆందోళన



ఉప్పుటేరు వద్ద ఆందోళన చేస్తున్న మత్స్యకారులు. (ఇన్‌సెట్) ఉప్పుటేరులో చనిపోయిన చేపలు

అచ్యుతాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక ఉప్పుటేరులో మరోసారి చేపలు మృత్యువాత పడ్డాయి. ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఫార్మా కంపెనీల నుంచి విడుదల చేస్తున్న ద్రవ రసాయన వ్యర్థాల కారణంగానే చేపలు చనిపోతున్నాయని మత్స్యకార నాయకులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు కొన్ని పరిశ్రమల నిర్వాహకులు రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకుండా, ట్యాంకర్లతో రాత్రిపూట బయటకు తీసుకువచ్చి ఉప్పుటేరులో కలిపేయడం పరిపాటిగా మారిందని ఆరోపించారు.ప మూడు రోజుల నుంచి వర్షాలు ... మిగతా 8వ పేజీలో

నేడు డీఎస్సీ మెరిట్ జాబితా

ఉమ్మడి జిల్లాల వారీగా విడుదల

- 24 లేదా 25న సర్టిఫికెట్ల పరిశీలన?
- ఉక్కు టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయం ఎంపిక
- ఎంఈవో/హెచ్‌ఎం/డిప్యూటీ తహశీల్దారుతో కూడిన 31 బృందాల నియామకం
- మొత్తం పోస్టులు 1,139
- అల్లూరి జిల్లాలో 400 పోస్టులు, సిటీ, మైదాన ప్రాంతంలో 739...



విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):

ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన డీఎస్సీ రాత పరీక్షకు సంబంధించి మెరిట్ జాబితా శుక్రవారం విడుదల చేయనున్నారు. ఐదారు రోజులుగా తర్జనభర్జన పడిన పాఠశాల విద్యా శాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లాల వారీగా మెరిట్ జాబితాలను రూపొందించారు. ఆ జాబితాలు జిల్లాలకు పంపుతారు. అదే సమయంలో వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నారు.

డీఎస్సీ రాత పరీక్షలో వచ్చిన మార్కులు, టెట్‌లో వచ్చిన మార్కులను కలిపి మెరిట్ జాబితా తయారుచేశారు. దీంట్లో ఏమైనా తప్పులు ఉన్నాయా? అన్నది ఒకటికి రెండుసార్లు సరి చూస్తున్నారు. శుక్రవారం మెరిట్ జాబితా విడుదల చేస్తారు. ఉమ్మడి జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. వాటిలో 400 పోస్టులు అల్లూరి సీతారామరాజు జిల్లాలో, మిగిలిన 739 పోస్టులు నగరం, మైదాన ప్రాంతాల్లో ఉన్నాయి. మొత్తం 1,139 పోస్టుల భర్తీకి ఇప్పటికే జిల్లా అధికారులు రోస్టర్ పాయింట్లు రూపొందించి పాఠశాల విద్యాశాఖకు పంపారు. రోస్టర్ పాయింట్లు ఆధారంగానే మెరిట్ జాబితా ఖరారు చేశారు.

దీని ఆధారంగా విశాఖపట్నంలో ఈనెల 24 లేదా 25వ తేదీ నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారని అంచనా వేస్తున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఉక్కుటౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయాన్ని ఎంపిక చేశారు. ఆ పాఠశాలలో 31 గదులలో సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లుచేస్తున్నారు. ప్రతి గదిలో 50 మంది వంతున అభ్యర్థులను కూర్చోబెట్టి వారి నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని పరిశీలన చేస్తారు. డీఎస్సీ రాత పరీక్షకు పెట్టుకున్న దరఖాస్తుకు జత చేసిన సర్టిఫికెట్ల నకళ్లతో సరిచూస్తారు. దరఖాస్తులకు జత చేసిన నకళ్ల వివరాలను ఆన్‌లైన్‌లోనే పరిశీలన చేస్తారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం ప్రతి గదికి ఎంఈవో/హెచ్‌ఎం/డిప్యూటీ తహశీల్దారుతో కూడిన బృందాలను నియమించారు. అంటే 31 మంది ఎంఈవోలు, హెచ్‌ఎంలు, డీటీలకు డ్యూటీలు వేశారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ఈ మేరకు విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్‌కు ఆదేశాలు జారీచేశారు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో 1:1 ప్రాతిపదికగానే ... మిగతా 8వ పేజీలో

అంగన్‌వాడీలకు మరో తీపికబురు

కార్యకర్తలు, ఆయాలకు గ్రాట్యుటీ అమలు

- రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- పదవీ విరమణ తరువాత కార్యకర్తకు రూ.లక్ష, ఆయాకు రూ.40 వేలు
- అంగన్‌వాడీ వర్కర్ల ఆనందం



అంగన్‌వాడీ కార్యకర్తలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్నికల ముందు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నది. ఇందులో భాగంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తూ కార్యకర్తలకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జీవో నంబర్ 116ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం జిల్లాలో 183 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా మారాయి. ఆయా కేంద్రాల్లో పనిచేస్తున్న పదో తరగతి విద్యార్హత కలిగిన కార్యకర్తలకు పదోన్నతులు కల్పించేందుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. తాజాగా అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు గ్రాట్యుటీ అమలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ-క్యాబినెట్ సమావేశంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న గ్రాట్యుటీ అమలుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేయడంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో 1,908 అంగన్‌వాడీ కేంద్రాలు వున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ప్రయోజనం చేకూరనున్నది. 62 సంవత్సరాలు నిండిన తరువాత పదవీవిరమణ సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తకు గ్రాట్యుటీగా రూ.లక్ష, ఆయాలకు రూ.40 వేలు ప్రభుత్వం అందించనుంది. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలు నెలకు రూ.11,500 వేతనం పొందుతున్నారు. ఆయాలకు రూ.7 వేలు అందుతుంది.

భారీ చోరీని ఛేదించిన విశాఖ పోలీసులు

- జూలై 13న శీలానగర్‌లో 100 తులాల బంగారం, రూ.13.5 లక్షల దొంగతనం
- ఈ ఘటనలో ముగ్గురు నిందితుల అరెస్టు
- 72 తులాల బంగారం రూ.9.04 లక్షల నగదు స్వాధీనం

- 8లో

పంట కాలువకు గండి

వృథాగా పోతున్న సాగునీరు

- ప్రశ్నార్థకంగా 500 ఎకరాల ఆయకట్టు
- ఆందోళన చెందుతున్న రైతులు
- అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని వినతి

మాకరవపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):

మాకవరపాలెంలో సుమారు 500 ఎకరాలకు నీరు అందించే మెరక కాలువ గట్టుకు గురువారం గండిపడింది. దీంతో ఆయకట్టుకు నీరు అందకపోవడంతో వరినాట్లు ఎండిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కాలువకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు



నీరు లేని వరి పొలాలు

సర్పా నది ఆధారంగా తవ్విన మెరక కాలువ కింద సుమారు 500 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఒక్క ఏడాది కూడా ఈ కాలువ నిర్వహణ గురించి పట్టించుకోలేదు. కాలువలో పూడిక పెరిగిపోయింది. గేట్లు మరమ్మతులకు గురయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకం కింద కాలులో పూడిక తీయించి, తుప్పలు తొలగించారు. కాలువ సిమెంటు గట్టు మరమ్మతులకు నిధులు మంజూరు కాకపోవడంతో రైతులంతా కలిసి ఇసుక బస్తాలతో తాత్కాలింగా పటిష్ఠం చేసుకున్నారు. నది నుంచి కాలువ ద్వారా పొలాలకు నీరు వస్తుండడంతో ఇటీవల వరినాట్లు వేశారు. అయితే మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కాలువ సిమెంటు గట్టుకు గండి పడింది. దీంతో కాలువ ద్వారా పొలాలకు నీరు వెళ్లడంలేదు. గండి పూడ్చేవరకు ఇదే పరిస్థితి కొనసాగుతుంది. పొలాలకు నీరు అందక వరినాట్లు ఎండిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి కాలువ గండి పూడివేత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అడుగుకో గొయ్యి!

దారుణంగా తయారైన పీఎస్‌పేట- జన్నవరం రోడ్డు

- వర్షాలతో మరింత అధ్వానం
- రాకపోకలకు మూడు మండలాల ప్రజల ఇక్కట్లు



జన్నవరం చెరకు కాటా వద్ద భారీ గోతులు ఏర్పడి ఆనవాళ్లు లేని తారు రోడ్డు



పీఎస్‌పేట సమీపంలో ఛిద్రమైన రహదారి

చోడవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే అధ్వానంగా వున్న పీఎస్‌పేట- జన్నవరం రోడ్డు.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరింత దయనీయంగా తయారైంది. పాత గోతులు పెద్దవి అయ్యాయి. కొత్తగా గోతులు ఏర్పడ్డాయి. వర్షాలు ఆగిపోయి రెండు రోజులైనప్పటికీ గోతుల్లో చేరిన నీరు మాత్రం అలాగే వుండిపోయింది. ఈ రహదారి మీదుగా చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఏళ్ల తరబడి నిర్వహణ పనులకు నోచుకోకపోవడంతో గుంతలమయంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం చోడవరం నుంచి పీఎస్ పేట మీదుగా జన్నవరం వరకు ఐదు కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.2.83 కోట్లు మంజూరు చేసింది. రోడ్డు పనులకు అప్పటి స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.1.2 కోట్లతో చోడవరం పట్టణంలో కొత్తూరు జంక్షన్ నుంచి కిలోమీటరు మేర సీసీ రోడ్డు నిర్మించారు. తరువాత జన్నవరం వరకు మిగిలిన నాలుగు కిలోమీటర్ల రోడ్డు బాగుపడలేదు. చాలా ఏళ్ల క్రితం వేసిన తారురోడ్డు ఆనవాళ్లు లేకుండా పోయింది. అడుగడుగునా గోతులు ఏర్పడి మెటల్ రోడ్డులా తయారైంది. దీనివల్ల ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు పాడైపోతున్నాయని ఆయా వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాపోతున్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి, పీఎస్‌పేట నుంచి జన్నవరం వరకు రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



జన్నవరం వంతెన సమీపంలో భారీ గొయ్యి

ప్రాణం తీసిన వృత్తి పరికరం

- ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ప్రమాదం
- కొబ్బరి కాయలు వలిచే గునపాం గుచ్చుకోవడంతో తీవ్రగాయాలు
- చికిత్స పొందుతూ వాడ్రాపల్లి ఉప సర్పంచ్ మృతి



కాకి ఈశ్వరరావు (ఫైల్‌ఫొటో)

మునగపాక, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తాడే పామై కాటేసిన చందంగా.. వృత్తి పరికరం యమపాశంగా మారి ఒకరి ప్రాణాలు తీసింది. మండలంలోని వాడ్రాపల్లిలో జరిగిన ఈ సంఘటనలో పంచాయతీ ఉప సర్పంచ్ మృతిచెందారు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. పంచాయతీ ఉప సర్పంచ్ కాకి ఈశ్వరరావు (52) వాడ్రాపల్లి ఆవలో చేపలవేట, కొబ్బరికాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం ఏడు గంటలకు వాడ్రాపల్లి ఆవకు, కొంతసేపటి తరువాత కొబ్బరితోటకు వెళ్లారు. ఇక్కడ పని పూర్తయిన తరువాత ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ క్రమంలో వెంట తీసుకువస్తున్న కొబ్బరికాయలు వలిచే గునపాం అతని కుడికాలు, పొట్టభాగంలో బలంగా గుచ్చుకుంది. తీవ్ర గాయాలైన ఈశ్వరరావును అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఇతనికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో నలుగురికి శిక్ష ఖరారు

- పదేళ్లపాటు కారాగారం, రూ.లక్ష చొప్పున జరిమానా

చోడవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో నలుగురు ముద్దాయిలకు పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ గురువారం స్థానిక 9వ అదనపు జిల్లా జడ్జి హరినారాయణ తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండున్నర సంవత్సరాలపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

చీడికాడ మండలం బైలపూడికి చెందిన జాజిమొగ్గల రమణ, దారపు మాణిక్యం, జాజిమొగ్గల నూకరాజు, కిరణంపల్లి భూలోక కలిసి 2015వ సంవత్సరం మార్చి 12వ తేదీన ఏజెన్సీ నుంచి ... మిగతా 8వ పేజీలో

పర్యాటక ప్రదేశంగా పెద్ద చెరువు

నర్సీపట్నంలో ట్యాంక్ బండ్ పనుల పునఃప్రారంభానికి సన్నాహాలు

- స్పీకర్ అయ్యన్న చొరవతో రూ.4.5 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- త్వరలో టెండర్ల ప్రక్రియ



నర్సీపట్నం పెద్ద చెరువు

నర్సీపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):

స్థానిక పెద్ద చెరువు (ట్యాంక్ బండ్) అభివృద్ధి పనులు పునఃప్రారంభించడానికి వేగంగా సన్నాహాలు జరుగుతున్నాయి. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవ ఫలితంగా రూ.4.5 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ వారంలో టెండర్ల ప్రక్రియ చేపట్టే అవకాశాలు ఉన్నాయని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

తెలుగుదేశం పార్టీ గతంలో (2014-19) అధికారంలో వున్నప్పుడు నాడు మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం పెద్ద చెరువు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి స్టేట్ హైవే ప్లాన్ నిధుల నుంచి ఆర్‌అండ్‌బీ శాఖ రూ.5.7 కోట్లు, పర్యాటక శాఖ నుంచి రూ.95 లక్షలు మంజూరు చేయించారు. 2018 డిసెంబరులో పనులకు ... మిగతా 8వ పేజీలో

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

- ట్రాలర్‌పై కాంక్రీట్ మిల్లర్‌ను తరలిస్తుండగా తెగిన విద్యుత్ తీగలు
- వెనుక బైక్‌పై వస్తున్న ఇద్దరిపై పడడంతో అక్కడికక్కడే మృతి
- నర్సీపట్నానికి చెందిన కాంటాక్టర్లుగా గుర్తింపు



సంఘటనా స్థలంలో మృతులు

పాడేరురూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలంలోని బొయితిలి గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు తెగి, బైక్‌పై వెళుతున్న ఇద్దరిపై పడడంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి జి.మాడుగుల మండలం గౌడుపుట్టు గ్రామానికి చెందిన ప్రత్యక్ష సాక్షి కొర్రా జీవన్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జి.మాడుగుల మండలం బొయితిలి- కిల్లంకోట మధ్య జరుగుతున్న రోడ్డు పనుల కోసం ... మిగతా 8వ పేజీలో

మరిడి మహాలక్ష్మిని దర్శించుకున్న నేతలు


మరిడి మహాలక్ష్మిని దర్శించుకున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో తిమ్మరాజుపేట, నాగులాపల్లి గ్రామాల్లో కొలువైన మరిడి మహాలక్ష్మీ అమ్మవారిని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ గురువారం దర్శించుకున్నారు. ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు వారు ఆలయాలకు విచ్చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారి వెంట ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

వైభవంగా పొలిమేరమ్మ జాతర


పొలిమేరమ్మని దర్శించుకుంటున్న భక్తులు, కూటమి నేతలు

ఎలమంచిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని యర్రవరం పొలిమేరమ్మ అమ్మవారి జాతర గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో భక్తులకు అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కూటమి నేతలు గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, కరణం రవికుమార్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా మహిళల కోలాటం, భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఘనంగా మరిణమ్మ జాతర


చినదొడ్డిగల్లులో బోనాల ఊరేగింపు

నక్కపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు, జీ జగన్నాథపురం గ్రామాల్లో గురువారం గ్రామ దేవతలు మరిణమ్మ జాతర ఘనంగా జరిగింది. చినదొడ్డిగల్లు గ్రామం పెద్దవీధి రామాలయం వద్ద ముందుగా అమ్మవారి ప్రధాన ఘటానికి ఉపమాక గురుభవానీ దవరసింగి రాంబాబు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనేక మంది మహిళా భక్తులు అమ్మవారిని ఆలయానికి తీసుకువెళ్లి బోనాలు సమర్పించారు. ఆలయంలో వున్న అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని జీ జగన్నాథపురం గ్రామంలో కూడా గురువారం సాయంత్రం బోనాల ఊరేగింపు ఘనంగా జరిగింది.

'వివాదాస్పద భూమిలోకి ఎవరూ రాకుండా చర్యలు తీసుకోండి'

పాయకరావుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద భూమిలోకి ఎవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన జక్కల శ్రీహరి అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఈమేరకు వినతి పత్రాన్ని తహశీల్దారు ఎస్‌ఏ.మహేశ్వరరావుకి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ పట్టణంలోని దేవీనగర్‌లో వివాదాస్పదమైన సుమారు ఎకరం భూమి గత కొంతకాలంగా కోర్టు పరిధిలో ఉందన్నారు. అయితే ఇటీవల కొంతమంది వ్యక్తులు ఈ భూమిలోకి వచ్చి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందనలేదని ఆరోపించారు. దీనిపై పరిశీలించి కోర్టు వివాదంలో ఉన్న భూమిలోకి ఎవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దారును కోరినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తంతటి కిరణ్‌కుమార్, ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సూరిబాబు, రాజబాబు, కర్రి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రమణ సేవలు చిరస్మరణీయం


రమణకు నివాళులర్పిస్తున్న పలువురు నాయకులు

నక్కపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గ్రామానికి చెందిన వైసీపీ నేత సాదిరెడ్డి రమణ లేని లోటు తీర్చలేనిదని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. రేబాక సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు తండ్రి రమణ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. గురువారం రేబాకలో సంతాపసభ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు సర్పంచ్ శ్రీనివాసరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జీ, వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, బీజేపీ నాయకుడు కోసూరి శ్రీను, సాదిరెడ్డి నారాయణమూర్తి, గంటా తిరుపతిరావు, సూరకాసుల గోవింద్, తళ్లా భార్గవ్, బచ్చలరాజు, కరణం ఈశ్వరరావు, గొర్ల నర్సింహమూర్తి, కరణం ఈశ్వరరావు, వెల్లంకి కాసుబాబు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

నక్కపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీఎల్ పురం, బంగారమ్మపేట గ్రామాల్లో గురువారం ఎంపీడీవో డీ సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు తదితరులు పర్యటించారు. మంచినీటి ట్యాంకు పరిసరాలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. డోర్ టూ డోర్ తడి, పొడిచెత్త సేకరణపై ఆరా తీశారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై ఆరా తీశారు.

కేజీబీవీ బాలికలకు చట్టాలపై అవగాహన

నక్కపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి కేజీబీవీ బాలికలకు గురువారం పలు చట్టాలు, యాప్‌లపై ట్రైనీ ఎస్‌ఐ సాహిబా అంజుమ్ అవగాహన కల్పించారు. శక్తి యాప్‌తో కలిగే ప్రయోజనలు, ఈ యాప్‌ను ఎలా వినియోగించాలనే విషయాన్ని వివరించారు. పోక్సో చట్టం ఎలా రక్షణ కల్పిస్తుందో తెలియజేశారు. బాలికలు ధైర్యంగా వుండాలని, ఎవరి నుంచైన అసభ్యకర ప్రవర్తన, వేధింపులు ఎదురైతే ఎలా తిప్పి కొట్టాలి? ఏం చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో సలీమా తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు..

» వీధుల్లో స్వైరవిహారం... » ఒంటరిగా కనిపిస్తే దాడి

» రాత్రిపూట వీధిలోకి వచ్చేందుకు భయపడుతున్న ప్రజలు


పాయకరావుపేటలో సంచరిస్తున్న కుక్కలు

పాయకరావుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో కుక్కలు. స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు భయపడిపోతున్నారు. రాత్రి, పగలు రోడ్లపై తిష్ట వేస్తున్న కుక్కలు వృద్ధులు, పిల్లలను ఒంటరిగా కనిపిస్తే దాడిచేసి గాయపరుస్తున్నాయి. గత కొన్నేళ్లుగా కుక్కల నియంత్రణపై పంచాయతీ కనీస దృష్టిపెట్టని కారణంగా పట్టణంలో విపరీతంగా పెరిగిపోయాయి. పలు వీధుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రిపూట వాహనాల వెంట పడుతుండగా.. రాత్రి పది దాటితే వీధుల్లో ఒంటరిగా నడిచివెళ్లేందుకు ప్రజలు భీతిల్లుతున్నారు. కోళ్లు కనబడితే చంపేస్తున్నాయి. రోడ్లపై వాహనాలు కనిపిస్తే వెంట పడుతున్నాయి. పలు సందర్భాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని పర్యాయాలు వాహనదారులను కుక్కలు కరుస్తున్నాయి. కొంత కాలంగా పట్టణంలో కుక్కల దాడిలో పలువురు చిన్నారులతోపాటు పదుల సంఖ్యలో మహిళలు, వృద్ధులు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పట్టణంలో కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముంపులో ములబందగోడి పొలాలు

» వర్షం తెరిపిచ్చినా తొలగని నీరు.. » ఆందోళనలో వరి రైతులు


మునగపాక ములబందగోడి ప్రాంతంలో నీటి ముంపునకు గురైన వరి పొలాలు

మునగపాక, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ములబందగోడి పొలాలు నీటి మునిగాయి. ఈనెల మొదటి వారంలో విపరీతమైన ఎండల్లో సాగునీరుకు కష్టతరమైనప్పటికీ అందుబాటులో ఉన్న బోరు నీటితో వరినాట్లు వేశారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో పొలాలు మునిగాయి. వర్షం తెరిపి ఇవ్వడంతో నీరు తొలగిపోతుందని ఆశతో ఎదురు చూసిన రైతులకు నిరాశే ఎదురైంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రధాన సాగునీటి కాలువల ద్వారా వచ్చిన నీరు పిల్ల కాలువల ద్వారా చేరడంతో నీటి ముంపు నుంచి పొలాలు తేరుకోలేదు. వాటికి నష్టం ఏర్పడే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఆదిలోనే నష్టం చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పేటకట్టు, వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో పొలాలు ముంపునకు గురయ్యాయి.

ఉధృతంగా మేజర్, మైనర్ శారదా నదులు

» జోరందుకున్న వరినాట్లు.. » 500 ఎకరాల్లో నాట్లు వేసిన రైతులు


కొత్తూరు వద్ద జోరుగా ప్రవహిస్తున్న మేజర్ శారదానది

రాంబిల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వర్షాలు సకాలంలో కురియకపోవడంతో వరినాట్లు ఆలస్యమయ్యాయి. ఇటీవల కురిసిన తుఫాన్ వర్షాలకు మేజర్, మైనర్ శారదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 5,653 ఎకరాలు కాగా రైతులు మూడు రోజులుగా వరినాట్లు పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. నదుల్లోను, పంట కాలువల్లోను నీరు పుష్కలంగా ఉండడంతో దిమిలి, కట్టుబోలు, మురకాడ, నారాయణపురం, మామిడివాడ, కొత్తూరు, గోకివాడ, వైలోవ, వెల్చూరు, రాజుకోడూరు, పంచదార్ల తదితర గ్రామాల్లో రైతులు వరినాట్లు వేస్తున్నారు. మూడు రోజుల్లో 500 ఎకరాల్లో వరినాట్లు వేశారని, ఈ నెలాఖరుకల్లా దాదాపు వరినాట్లు పూర్తవుతాయని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత తెలిపారు. ఇప్పటికే ఎదజల్లే పద్ధతిలో దిమిలి, మురకాడ గ్రామాల్లో 25 ఎకరాల్లో నాట్లు వేశారన్నారు. ప్రతి రోజూ వరినాట్లు వేస్తున్న వరి పొలాలను సందర్శించి రైతులకు సూచనలు చేస్తున్నామని ఏవో సుమంత తెలిపారు.

పెదపల్లి రైల్వే గేటు అండర్ బ్రిడ్జి ఏర్పాటుకు పరిశీలన


అండర్ బ్రిడ్జి ప్లాన్‌ను పరిశీలిస్తున్న రైల్వే, మునిసిపల్ అధికారులు

ఎలమంచిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదపల్లి రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి(ఆర్‌యుబి)నిర్మాణానికి సంబంధించిన ప్లాన్‌ను గురువారం రైల్వే, మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. మునిసిపల్ డీఈ మధుసూదనరావు, ఏఈ నానాజీలతో పాటు రైల్వే అధికారులు రైలు గేటు ఏర్పాటు చేసే స్థలాన్ని గుర్తించారు. దీంతో ఆ ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పెదపల్లి రైలుగేటు నిత్యం పడుతుండడంతో రామ్‌నగర్, పెదపల్లి, శ్రీరామ్‌నగర్, గొల్లలపాలెం, పెదగొల్లలపాలెం, అల్లూరి సీతారామరాజు కాలనీ ప్రజలు ప్రతి రోజూ ఇబ్బందులకు గురవుతున్నారు. గత వైసీపీ పాలనలో అప్పటి పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పెదపల్లి రైల్వేగేటు సమస్యపై అటు పాలకులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో ఒక అడుగు ముందుకు పడినట్లయింది. ఇంజనీరింగ్ అధికారులు పరిశీలన చేయడంతో ఇక గేటు కష్టాలు తీరనున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారుల ఉపాధికి భంగం కలిగితే సహించను

» ఉప్పుటేరులో నీటిని తొలగించాలి.. » ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్


ఉప్పుటేరులో నీటిని పరిశీలిస్తున్న అధికారులు

అచ్యుతాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఉపాధికి భంగం కలిగితే సహించేది లేదని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్పష్టం చేశారు. కాలుష్యం కారణంగా మూడు రోజుల నుంచి ఉప్పుటేరులో చేపలు భారీగా చనిపోతున్నాయనే విషయం తెలుసుకున్న ఆయన గురువారం అధికారులతోపాటు కర్మాగారాల ప్రతినిధులతో కలిసి ఉప్పుటేరుని పరిశీలించారు. ఉప్పుటేరులో నీరు నల్లగా ఉండలంతో పాటు చేపలు కూడా చనిపోయి తేలిపోవడాన్ని గమనించారు. ఫార్మా కర్మాగారాల నుంచి వ్యర్థాలు రాత్రి పూట ట్యాంకర్లతో తెచ్చి ఉప్పుటేరులో కలిపేస్తున్నారని అందువల్లే చేపలు భారీగా చనిపోతున్నాయని పూడిమడక మాజీ సర్పంచ్ మేరుగు బాపునాయుడు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన అధికారులతో పాటు కర్మాగారం ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్యకారులకు చేపల వేటే జీవనాధారమని, అటువంటిది వారి జీవనానికి విఘాతం కల్గిస్తే సహించేది లేదన్నారు. అనంతరం రాంబిల్లి మండలం సీతపాలెం, పెదయాతపాలెం నుంచి వస్తున్న కాలువను కూడా ఆయన పరిశీలించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఉప్పుటేరులోని కాలుష్యానికి గురైన నీటిని ట్యాంకర్ల ద్వారా తొలగించాలని ఏపీఐఐసీ డీజెడ్‌ఎం సూర్యనారాయణను ఆదేశించారు. మరల ఇటువంటివి పునరావృతం అయితే సహించేది లేదన్నారు. ఎమ్మెల్యే సోదరుడు సతీష్ కుమార్, మత్స్యశాఖ అధికారి రవితేజ, మత్స్యకార నాయకులు మేరుగు వెంకటరావు, ప్రవీణ్, పారు నాయుడు, మేరుగు మహేష్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలంటూ అంగన్‌వాడీలు ఆందోళన


అచ్యుతాపురం ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్నిస్తున్న అంగన్‌వాడీలు


తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

అచ్యుతాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తమకు కనీస వేతనాలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలంటూ అంగన్‌వాడీలు గురువారం ఎంపీడీఓ, తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ.. పనిభారం పెరిగింది కాని 2019 నుంచి వేతనాలు పెంచలేదని వారన్నారు. 2024లో 45 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు కాని ఇంతవరకు పెంచలేదన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌ల నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పనిచేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే అన్ని సరుకులు ఒకసారి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అనంతరం ఎంపీడీఓ సత్యవరాహ శ్రీనివాసరావు, డీటీ వై శ్యామ్‌కుమార్‌కి వినతి పత్రాలనిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కె. సోమునాయుడు, నారాయణమ్మ, వరలక్ష్మి, అంబిక, హేమకుమారి, మంగ, యమున, భారతి పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

తమ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని గురువారం అంగన్‌వాడీలు తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. గత కొంత కాలంలో పలు యాప్‌లతో ఇబ్బందులు పడుతున్నామని, పెన్షన్ డ్యూటీలు రద్దు చేయాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు సీహెచ్ రామకృష్ణ, ఎస్.నారాయణరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, వనజ, కుమారి, తులసి, మంగ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ గురువారం తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినతిపత్రాలను తహశీల్దారు వరహాలుకు, ఎంపీడీఓ కేఎస్.కొండలరావులకు వేర్వేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు శశి, నూకరత్నం, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

అంగన్‌వాడీలకు పెంచిన పనిభారాన్ని తగ్గించి వేతనాలను పెంచాలని జిల్లా ఉమెన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీ సుబ్బలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద తమకు ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని అంగన్‌వాడీ డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ నర్సింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీరాజ్యం, కవితి, పైడితల్లి పాల్గొన్నారు.

ఎసెన్షియా ఫార్మా మృతులకు ఘన నివాళి


రాంబిల్లి: కార్మికుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కంపెనీ ప్రతినిధి

రాంబిల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్ఈజెడ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో పేలుడు మృతులకు గురువారం కంపెనీ ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. గత ఏడాది కంపెనీలో జరిగిన పేలుడులో 17 మంది కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు కంపెనీ ప్రతినిధులు, ఉద్యోగులు రక్తదానం చేశారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలు పాటించడంతోపాటు కార్మికుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు దేవకి వాసుదేవరావు, సంజయ్‌కుమార్, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

అచ్యుతాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):భద్రతా ప్రమాణాలు పాటించని కంపెనీలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. అచ్యుతాపురం సెజ్‌లో 2024 ఆగస్టు 21న ఎసెన్షియా కర్మాగారంలో భారీ ప్రమాదం జరిగి 17 మంది మృతిచెందారు. వీరి సంతాప దినాన్ని అచ్యుతాపురం జంక్షన్‌లో గురువారం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారాల్లో యాజమాన్యాలు లాభాపేక్షే తప్ప సరైన భద్రత ప్రమాణాలు పాటించటంలేదన్నారు. కార్యక్రమంలో కె. సోమునాయుడు, పోలవరపు దుర్గ, నాగేష్, పైడ్రాజు, గోవిందు, రామకృష్ణ పాల్గొన్నారు.

కడప స్పోర్ట్స్ స్కూల్‌కి సాత్విక్ ఎంపిక



నక్కపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎస్ హాకీ క్లబ్ ద్వారా శిక్షణ పొందుతున్న నక్కపల్లికి చెందిన నాలుగో తరగతి విద్యార్థి కర్రి సాత్విక్ కడప డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనట్టు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఎల్‌వీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 9 నుంచి అనకాపల్లిలో జరిగిన జిల్లా స్థాయి హాకీ సెలక్షన్స్‌లో సాత్విక్ ప్రతిభ కనబర్చి, జూలై 21న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్టు తెలిపారు. దీంతో ఈ బాలుడు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షుడు చిన్న అప్పారావు, కోచ్ రాంబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, సీనియర్ క్రీడాకారుడు గాజుల రామచంద్రరావు, రజిత్, కొల్నాటి నానాజీ తదితరులు సాత్విక్‌ను అభినందించారు.

డీజీ లక్ష్మిలు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకోవాలి

మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో డీజీ లక్ష్మిలుగా ఎంపికైన వారంతా ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని స్వయం సమృద్ధిని సాధించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. గురువారం మునిసిపల్ కార్యాలయ ఆవరణలో డీజీ లక్ష్మిలు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డీజీ లక్ష్మిలు అందిస్తున్న సేవలు అన్ని వర్గాల ప్రజలకు సకాలంలో అందేలా కృషి చేయాలన్నారు. వారికి సచివాలయ సిబ్బంది సహకారం అందించాలన్నారు. మెప్మా సీఎంఎం పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుతం డీజీ లక్ష్మిలు విద్యుత బిల్లులు, ఫోన్, టీవీ రీచార్జ్‌లు వంటి సేవలు అందిస్తున్నారని, ఈనెలాఖరుకు మరిన్ని సేవలు అందించేలా కార్యాచరణ సిద్ధమైందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కోఆప్షన్ మెంబరు బీబీ, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఏజీపీగా పాల్తేరు యువకుడు


లోవరాజు

పాయకరావుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాల్తేరు గ్రామానికి చెందిన ఉప్పలపాటి లోవరాజు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాల్తేరు గ్రామానికి చెందిన దేవవరపు లోవరాజు మనుమడు అయిన ఉప్పలపాటి లోవరాజు బీఏ.ఎల్ఎల్‌బీ., ఎల్ఎల్ఎం చదువుకుని తొలుత కాకినాడ జిల్లా తుని, అనంతరం పిఠాపురం కోర్టుల్లో లాయర్‌గా కొంతకాలం పనిచేశారు. ప్రస్తుతం ఏపీ హైకోర్టు లాయర్‌గా పనిచేస్తున్న లోవరాజుని ప్రభుత్వం ఏజీపీగా నియమించడం పట్ల కుటుంబ సభ్యులు, తుని బార్ కౌన్సిల్ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

ఎస్.రాయవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో తిమ్మాపురం గ్రామానికి చెందిన గొరపల్లి అనురాధ వైద్యం నిమిత్తం రాష్ట్ర హోం మంత్రి అనిత సిఫార్సు మేరకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ 38,500 చెక్కును టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, కొరుప్రోలు సొసైటీ చైర్‌పర్సన్ గుర్రం రామకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వి.గోవిందు, కె.అప్పలకొండ, బి.లోవరాజు, కొత్తల నాగేశ్వరరావు, శ్రీను, అశోక్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మన్‌కు స్వల్ప గాయం

మునగపాక, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో గణపర్తిలో గురువారం విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్ మరమ్మతు చేస్తుండగా లైన్‌మన్ డీవీపీ. శ్రీనివాస్‌కు విద్యుత్‌షాక్‌కు గురై స్వల్ప గాయాలయ్యాయి. ఆయన అనకాపల్లి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, ప్రమాదం ఏమీ లేదని ఏఈ తెలిపారు.

హైస్కూల్ విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్


చేతులు శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాయకరావుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా గురువారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత, పేషెంట్‌ని రిసీవ్ చేసుకోవడం, బీపీ చెకింగ్, ఇంజక్షన్ చేయడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఘనంగా నల్లమారమ్మ తల్లి పండుగ



అమ్మవారి పూజల్లో పాల్గొన్న మూడు గ్రామాలకు చెందిన ప్రజలు

కశింకోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూతనగుంటపాలెం గ్రామంలో నల్లమారమ్మ తల్లి పండుగ గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుక త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం, నూతనగుంటపాలెం గ్రామాలకు చెందినది కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి అమ్మవారుగా కొలిచే వేపచెట్టు వద్దకు పసుపు, కుంకుమలతో పాటు వివిధ రకాల పిండి వంటలను నైవేద్యంగా పెట్టి పూజలు చేశారు. సాయంత్రం గ్రామ పురవీధుల గుండా ఘటాలు ఊరేగింపు నిర్వహించారు. రాత్రికి ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రామాయణంపై న్యాయ విద్యార్థులకు అవగాహన



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ హనుమంతు లజిపతిరాయ

సబ్బవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు గురువారం వాల్మీకి రామాయణంలో 'ధర్మం-న్యాయ పునాదులు పరిపాలన' అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాల్మీకి రామాయణ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ ముఖ్య అతిథిగా మాట్లాడారు. రామాయణంలోని న్యాయ, పరిపాలన, విలువలపై సోదాహరణగా వివరించారు. అంతకు ముందు వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ వాల్మీకి రామాయణ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో సెప్టెంబరు 20న విజయనగరంలోని రామనారాయణంలో జరగనున్న 'శ్రీరామాయణ శంఖారావం' కార్యక్రమానికి తమ వర్సిటీ విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కశింకోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మత్తు పదార్థాలకు ఉండాలని అనకాపల్లి జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు సూచించారు. తాళ్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు 'మత్తు పదార్థాలు, బాల్య వివాహాల వల్ల అనర్థాలు'పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా, బాల కార్మికులు, బాలలు భిక్షాటన చేయడం వంటివి నేరమన్నారు. ఇటువంటివి చేసిన వారికి కఠినంగా శిక్షలు పడతాయని హెచ్చరించారు. బాలలు మత్తు మందులకు బానిస కాకుండా స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలన్నారు. బాల బాలికల్లో వేరు వేరుగా సంఘాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.ప్రసాద్, ఉపాధ్యాయులు కళ్యాణిగౌరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ 'ఫైబర్ బేసిక్ టీవీ'పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పాల్ విలియమ్స్

కొత్తూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బీఎస్ఎన్ఎల్ కొత్తగా ప్రవేశపెట్టి 'ఫైబర్ బేసిక్ టీవీ' ప్లాన్‌పై కేబుల్ ఆపరేటర్లకు అనకాపల్లిలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పాల్ విలియమ్స్ మాట్లాడుతూ సంస్థ సరికొత్త సేవలపై వివరించారు. ఫైబర్ బేసిక్ టీవీ ప్లాన్‌లో ఓటీటీ, అన్‌లిమిటెడ్ ఫ్రీ ఫోన్ కాల్స్ ఉంటాయన్నారు. ఇప్పటికే విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని ఆఫీసు నెట్‌వర్క్‌ను ఉపయోగించుకొని బీఎస్ఎన్ఎల్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు జగదీశ్వరరావు, బేగం, ఏజీఎం నావెల్ కిశోర్, డీఈ గోపీనాథ్, డీఈ రమేష్ పాల్గొన్నారు.

నెలంతా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రను నిర్వహించాలి : జడ్సీ



ఆర్‌పీలు, ఎస్‌హెచ్ గ్రూపులతో మాట్లాడుతున్న కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఈ నెలంతా విజయవంతంగా నిర్వహించాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి అన్నారు. గురువారం ఇక్కడ ఎస్‌హెచ్‌జీ, ఆర్‌పీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అందరూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, డెంగ్యూ, మలేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. దోమల నివారణకు ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో శానిటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్, ఏపీడీ, ఆర్‌పీలు పాల్గొన్నారు.

'వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వినాయక ఉత్సవాలను సంప్రదాయంగా జరుపుకోవాలని డీఎస్పీ ఎం.శ్రావణి అన్నారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు సింగిల్‌విండో విధానం ద్వారా స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలన్నారు. చవితి వేడుకల్లో మైక్‌కు అనుమతి తప్పనిసరిగా పేర్కొన్నారు. వినాయక విగ్రహాల అనుపు వేడుకలను తొమ్మిది లేదా 11వ తేదీలోగా చేపట్టాలన్నారు. అశ్లీల నృత్యాలు లేకుండా వేడుకలు జరుపుకోవాలన్నారు. అలాగే వేడుకల్లో భాగంగా డీజే సౌండ్ ఎక్కువగా పెడితే టౌన్ న్యూసెన్స్ యాక్టు కింద చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారులపై ఎవరైనా విగ్రహాలు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సీఐ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఐలు టీవీ విజయ్ కుమార్, ఎం. వెంకటనారాయణ, ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి'

తుమ్మపాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రామకృష్ణ కోరారు. అనకాపల్లిలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పశువుల సంతల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పశువుల అక్రమ రవాణాపై పోలీస్‌శాఖ నిరంతరం నిఘా పెట్టాలని, అనుమతులు లేకుండా కబేళాలు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. అలాగే గోవుల సంరక్షణ కోసం ప్రభుత్వం గోశాలలను నిర్మించాలని విన్నవించారు. అనంతరం గోసంరక్షణ సమాఖ్య జిల్లా జిల్లా అధ్యక్షుడిగా మర్రా అనిల్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే మరో 15 మంది సభ్యులుగా నియమించారు. ఈ కార్యక్రమంలో దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొణతాల అప్పలరాజు, నాయకులు కేవీఆర్ సత్యనారాయణ, సీలపు దేవి, చింతలపూడి రూపావతి, పి.పైడిరాజు, ప్రవీణ్‌కుమార్, మైలపల్లి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత వేళల్లోనే సరకు లోడింగ్, అన్‌లోడింగ్

- పట్టణంలోని వ్యాపారుల సమావేశంలో డీఎస్పీ శ్రావణి సూచన
- ట్రాఫిక్ నియంత్రణకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడి
- కూరగాయల మార్కెట్ వద్ద గల డీసీఎంఎస్ స్థలాన్ని వాహనాల పార్కింగ్‌కు వాడుకోవచ్చునన్న చైర్మన్ కోట్ని బాలాజీ



వర్తకుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి, చిత్రంలో డీసీఎంఎస్ చైర్మన్ బాలాజీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వ్యాపారులు తమ దుకాణాల వద్ద సరుకు లోడింగ్, అన్ లోడింగ్ వేళలను విధిగా పాటించాలని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి స్పష్టం చేశారు. ఇక్కడి పోలీస్ అతిథి గృహం సమావేశ మందిరంలో వర్తకులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాత్రి ఎనిమిది నుంచి మరుసటి రోజు ఉదయం ఎనిమిది గంటల లోపు మాత్రమే ఇతర ప్రాంతాల నుంచి తమ వ్యాపార సంస్థలకు వచ్చే సరుకు లోడింగ్, అన్‌లోడింగ్ జరుపుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై ఇతర వేళల్లో వాహనాల నుంచి లోడింగ్ అన్‌లోడింగ్ చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వాహనాలు సమయానికి ముందు వస్తే కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో పెట్టి వేళ అయిన తరువాత లోడింగ్ అన్‌లోడింగ్ చేసుకోవాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి వర్త కులంతా సహకరించాలని ఆమె కోరారు. అలాగే రహదారులపై తెల్లగీత లోపల వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని డీఎస్పీ సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు వర్త కులు మాట్లాడుతూ చాలా కాలంగా మధ్యాహ్నం వేళల్లో ఒంటి గంట నుంచి నాలుగు గంటల మధ్య సరుకు లోడింగ్, అన్‌లోడింగ్‌కు అవకాశం ఉండేదన్నారు. ఆ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. దీనిపై డీఎస్పీ సమాధానం ఇస్తూ అనకాపల్లి జిల్లాగా ఏర్పడిన తరువాత ట్రాఫిక్ సమస్య పెరిగినందున ముఖ్యంగా మెయిన్ రోడ్డులో ఆ సమయంలో లోడింగ్, అన్‌లోడింగ్‌కు అవకాశం ఇవ్వలేమన్నారు. నెల రోజుల పాటు తాము సూచించిన విధంగా సమయాలు పాటించాలని స్పష్టం చేశారు. తరువాత మరో సమావేశం ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు, వర్తకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ నెల 24 నుంచి తాము సూచించిన వేళలు పాటించాలని కోరారు.

డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగినందున, వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి స్థలం లేకపోవడంతో కూరగాయల మార్కెట్ వద్ద గల డీసీఎంఎస్ స్థలాన్ని జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పార్కింగ్‌కు సిద్ధం చేశామన్నారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా ఉండేలా పార్కింగ్ రుసుము నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఆ మేరకు వర్తకులు తమకు వచ్చే వాహనాలను కేటాయించిన స్థలంలో పార్కింగ్ చేసుకోవాలని వివరించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఓటు చోర్.. గద్దీ చోడ్' పేరిట కాంగ్రెస్ నిరసన

- బీజేపీ నైతిక బాధ్యత వహించాలని నేతల డిమాండ్



అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : 'ఓటు చోర్ గద్దీ చోడ్' పేరిట పట్టణంలోని నెహ్రూచౌక్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం రాత్రి కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తులు చేతబట్టి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్ శౌంఠి నాగరాజు మాట్లాడుతూ దేశంలో వివిధ నియోజకవర్గాల్లో ఐదు విధాలుగా దొంగ ఓట్లను బీజేపీ ఓటర్ లిస్టులో చేర్పించిందని ఆరోపించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల తరువాత వివిధ రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గంపగుత్తగా దొంగ ఓటర్లను ఎలక్షన్ కమిషన్ చేతకానితనం వలన బీజేపీ విపరీతంగా చేర్పించిందని మండిపడ్డారు. డీసీసీ అధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ నాశనం చేసిందన్నారు. దొంగ ఓట్ల ద్వారా గెలిచిన బీజేపీ వెంటనే నైతిక బాధ్యత వహించి ప్రధాని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ బొంతు రమణ, ఎలమంచిలి, పాయకరావుపేట, మాడుగుల, పెందుర్తి అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు తనకాల అనంతరావు, మారుతి చక్రవర్తి, పడాల కొండలరావు, విన్నకోట రాము, జిల్లా ప్రధాన కార్యదర్శులు కాళ్ళ సత్యనారాయణ, ఎం.రాహుల్, కె.వి.మాణిక్యం, బోయిన భానుమూర్తి యాదవ్, కత్తెర శ్రీధర్, వెంకటరమణ, సిద్ధాజి గున్నబాబు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.బాల మురళీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేత



మంజూరు అందజేస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

తుమ్మపాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను పలువురికి రాష్ట్ర అర్బన్, ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే వివిధ పథకాలు ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, నాయకులు కరణం శ్రీనివాసరావు, పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా గురువారం ఇక్కడ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జిల్లా అధికారి ఎం. వినోద్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని, మంచి అలవాట్లు నేర్చుకోవాలని సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ప్రతినిధి సీపీఎం రామచందర్, సీఎస్‌వో డాక్టర్ స్పందనా ప్రశాంతి, డీఎండీవో చిరంజీవి, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ భవన స్థలం ఆక్రమణకు అడ్డుకట్ట

కొత్తూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ భవన నిర్మాణానికి ఇటీవల కొత్తూరులో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ శంకుస్థాపన చేసిన స్థలాన్ని ఆక్రమించేందుకు గుర్తు తెలియని వ్యక్తులు సన్నాహాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా సదరు స్థలంలో సిమెంటు పలకలతో హద్దులు నిర్ణయించి కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు అక్కడికి చేరుకొని గురువారం ఆక్రమణలను తొలగించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

- పార్టీ ఓబీసీ రాష్ట్ర చైర్మన్ శౌంఠి నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఓబీసీ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ శౌంఠి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానికంగా జరిగిన ఓబీసీ కాంగ్రెస్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అనకాపల్లి జిల్లా ఓబీసీ కాంగ్రెస్ ముందంజలో ఉందన్నారు. అన్ని నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేసి కమిటీలు పూర్తి చేయాలన్నారు. అనకాపల్లి జిల్లా ఓబీసీ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతు రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓబీసీ కాంగ్రెస్ జిల్లా నాయకులు అనంతు, రాము, నారాయణ చక్రవర్తి, శ్రీనివాసరావు, బుద్ధ మహేష్, గోవింద, కాళ్ల వెంకటేశ్వరరావు, కత్తెర శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుమార్తెకు కారుణ్య నియామక పత్రం



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ

అనకాపల్లి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆర్మ్డ్ రిజర్వు (ఏఆర్) హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మృతి చెందిన ఈశ్వరరావు కుటుంబానికి కారుణ్య నియామక కోటా కింద ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈశ్వరరావు కుమార్తె శిరీషకు జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ హోదాలో నియమిస్తూ ఎస్పీ తుహిన్‌సిన్హా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అంకితభావం, నిజాయితీతో విధులు నిర్వహిస్తూ ఇటు కుటుంబానికి, అటు పోలీస్‌శాఖకు గౌరవం తీసుకురావాలని ఆమెకు సూచించారు.

నేడు 'డయల్ యువర్ ఏఈ'

తుమ్మపాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : తుమ్మపాల సెక్షన్ పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి శుక్రవారం నిర్వహించే డయల్ యువర్ ఏఈ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని ఆర్ఈసీఎస్ ఏఈ దుర్గాప్రసాద్ కోరారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుందన్నారు. విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న వారు 8333811265, 7981842244 ఫోన్ నంబర్లలో వివరించాల్సిందిగా ఆయన కోరారు.

45 మంది అనర్హులకు దివ్యాంగ పింఛన్లు నిలిపివేత

పరవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పదిహేను పంచాయతీల్లో మొత్తం 45 మందిని దివ్యాంగ పింఛన్లకు అనర్హులుగా గుర్తించామని ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు గురువారం విలేకరులకు తెలిపారు. వైద్యులు ధ్రువీకరించిన అన్ని కేటగిరీల దివ్యాంగుల వైకల్య శాతాన్ని పింఛన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. 85 శాతానికి పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులు మంచానికే పరిమితమైనట్లు వైద్యులు ధ్రువీకరిస్తే రూ.15వేలు పింఛన్ యథావిధిగా వస్తుందన్నారు. 40 నుంచి 85శాతం ఉన్నట్లయితే రూ.ఆరు వేలు దివ్యాంగ పింఛన్ ఇస్తారని వివరించారు. నలభై శాతం కంటే తక్కువ ఉంటే రూ.15వేలకు బదులు వృద్ధాప్య పింఛన్ రూ.నాలుగు వేలు మంజూరు చేస్తారన్నారు. 40 శాతం కంటే తక్కువ ఉండే 60 సంవత్సరాల లోపు వారికి సెప్టెంబరు నుంచి పింఛన్ నిలిపివేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. వారి వివరాలు సచివాలయం లాగిన్‌లో ఉంచామని, ఈ నెల 25వ తేదీ లోగా దీనిపై అపీల్‌కు వెళ్లవచ్చునని ఎంపీడీవో వివరించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ సబ్జెక్టును ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ తెలిపారు. పీజీ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, నెట్/స్లెట్/పీహెచ్‌డీ కలిగి ఉన్న అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. అభ్యర్థుల విద్యార్హత, బోధన అనుభవంతో పాటు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జెరాక్స్‌తో డెమో క్లాసు నిర్వహించేందుకు ఈనెల 23న ఉదయం 10 గంటలకు సబ్బవరంలోని డిగ్రీ కళాశాలకు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి : జడ్సీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి శానిటేషన్ విభాగం సిబ్బంది స్పష్టం చేశారు. గురువారం ఆయన నిదానందొడ్డి, రింగురోడ్డు, మార్కెట్‌యార్డు రోడ్లల్లో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని చూసి సిబ్బంది ద్వారా బయటకు తీయించి దూర ప్రాంతాలకు తరలించారు. రహదారి నిర్మాణంలో భాగంగా మెయిన్‌రోడ్డు నుంచి రింగురోడ్డుకు వెళ్లే ప్రధాన మార్గంలోని గోతుల్లో నిలిచి పోయిన వర్షపునీటిని పరిశీలించి తక్షణమే నీటిని కాలువల్లోకి మళ్లించాలని సిబ్బందికి సూచించారు.

ప్రధాన రహదారిపై ఫ్లైయాష్, బొగ్గు తొలగింపు

లంకెలపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం కూడలి నుంచి ఫార్మాసిటీ రవాదారిలో పేరుకుపోయిన బొగ్గు, ఫ్లైయాష్ బూడిద తొలగింపు పనులకు అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. నిత్యం లారీల్లో పరిమితికి మించి బొగ్గు, ఫ్లైయాష్ రవాణా చేస్తుండడంతో ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున పేరుకు పోయాయి. భారీ వాహనాల వేగానికి వెనుక వచ్చే ద్విచక్ర వాహన చోదకుల కళ్లలోకి అవి ఎగసి పడుతుండడంతో పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ తీసుకు వెళ్లడంతో పేరుకుపోయిన బొగ్గు, బూడిదను యంత్రాల సాయంతో తొలిగింపు చేపడుతున్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సబ్బవరం సెక్షన్ కొప్పాక సబ్‌స్టేషన్ పరిధిలోని శంకరం ఫీడర్ మరమ్మతు పనులు చేపట్టనున్నందున శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ సబ్బవరం సెక్షన్-1 ఏఈ అశోక్ తెలిపారు. ఈ కారణంగా అనకాపల్లి మండలం శం కరం, భట్లపూడి, గొలగాం, గోపాలపురం, రేబాక, అగ్రహారం, కోడూరు, కొండుపాలెం పంచాయతీల పరిధిలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ఆందోళన



అనకాపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నా



కశింకోట తహశీల్దార్ కార్యాలయం వద్ద మానవహారం



పరవాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద...



సబ్బవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద...

అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలి, పెన్షన్ డ్యూటీ నుంచి మినహాయిపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇక్కడి తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లాప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి, రాష్ట్రంలో 2019 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. 42రోజుల సమ్మె సందర్భంగా జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహణకు ఇచ్చిన ఫోన్లు పనిచేయకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తక్షణమే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఎస్.వరలక్ష్మి, కాసులమ్మ, రామలక్ష్మి, ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, ఉమా నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట : పింఛన్ల పంపిణీ బాధ్యతలు తమకు అప్పగించవద్దంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద నుంచి ఎంపీడీవో కార్యాలయం వద్ద వరకు ర్యాలీగా వెళ్లి మానవహారంగా ఏర్పాడ్డారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు తనూజ, గంగవేణి, రజిని, సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడారు. అంగన్‌వాడీలకు పెన్షన్ పంపిణీ బాధ్యతలు వద్దని శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. తక్షణమే సమస్యలన్నింటినీ పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీలు రమాదేవి, శ్యామల, కుమారి, అమ్మాజీ, లక్ష్మి, వెంకటలక్ష్మి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ : కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలంతా కలిసిఇక్కడి మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలు సీహెచ్.దేవి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. యూనియన్ కార్యదర్శి ఎం.రమణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు అమ్మాజీ, నీలిమా, భవానీ, అరుణ, దేవి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట గురువారం అంగన్‌వాడీలతో కలిసి సమస్యలపై ఆందోళన చేపట్టారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని, నాణ్యమైన 5జి ఫోన్లు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఆ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు వీవీ రమణమ్మ, ఎం వరలక్ష్మి, బి.రమణమ్మ, ఎస్.జగదేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం: జేసీ



గిరిజన ఉత్పత్తులను పరిశీలిస్తున్న జేసీ డాక్టర్.ఎంజే అభిషేక్ గౌడ

పాడేరురూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ట్రైపాడ్ ద్వారా గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్టు జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ అన్నారు. వెలుగు జిల్లా సమాఖ్య కేంద్రంలో సంబంధిత అధికారులతో వందన్ వికాస్ కేంద్రాల గిరిజన మహిళ సభ్యులు నిర్వహించిన గిరిజన ఉత్పత్తుల ప్రదర్శనను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందన్ వికాస కేంద్రాల సభ్యులు గిరిజన ఉత్పత్తులను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన స్టోర్స్‌లలో విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్యాకింగ్, బ్రాండింగ్‌పై ట్రైపాడ్ శిక్షణ అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైపాడ్ రీజనల్ మేనేజర్ రమేశ్, వెలుగు అడ్మిన్ అసిస్టెంట్ కె.అప్పారావుపాల్గొన్నారు.

గొందివలసలో వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

డుంబ్రిగుడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోర్రా పంచాయతీ సర్పంచ్ అర్జున్ ఉప సర్పంచ్ మాలిక్ ప్రత్యేక చొరవతో గురువారం వైద్యాధికారి రాంబాబు ఆధ్వర్యంలో గొందివలస గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 40మంది చికిత్సనందించారు. 18 మంది మహిళలకు రక్త పరీక్షలు చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై ఇంటింటికీ వెళ్లి అవగహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లవరాజు, ఏఎన్ఎం సుమాంజలి, సిబ్బంది పుష్ప పాల్గొన్నారు.

కొత్త మండలాల ఏర్పాటుకు సహకరించాలి



బీజేపీ అధ్యక్షుడు మాధవ్‌కు వినతిపత్రమిస్తున్న మద్దిగరువు మండల సాధన కమిటీ సభ్యులు

పాడేరురూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పాడేరు వచ్చిన బీజేపీ అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్‌ను జి.మాడుగుల మండలం మద్దిగరువు, పాడేరు మండలం గుత్తులపుట్టు గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటుకు సహకరించాలని ఆయా మండల సాధన కమిటీ ప్రతినిధులు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలందించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త మండలాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన 13 గ్రామ పంచాయతీలకు అనువుగా ఉన్న జి.మాడుగుల మండలంలోని మద్దిగరువును మండల కేంద్రంగా ఏర్పాటుకు సహకరించాలని ప్రతినిధులు మునిపల్లి పండన్న, తరడ రాము, జి.సింహాద్రి, వై.శ్రీను, టి.దయానిధి, ఈ.గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, పాడేరు, పెదబయలు, హుకుంపేట మండలాలకు చెందిన 16 పంచాయతీలకు అనువుగా ఉండే పాడేరు మండలం గుత్తులపుట్టును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ మండల సాధన కమిటీ ప్రతినిధులు వి.సూరిబాబు, ఎం.బాబూజీ, ఎ.ఆనంద్, పి.చందు, వి.రాంబాబు, పి.చిన్నారావు, బి.బెన్నయ్యపడాల్ తదితరులు వినతిపత్రం అందించారు.

రైల్వే కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి

అరకులోయ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అరకు కేకే రైల్వేలైన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీవో ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. గురువారం ఏపీ గిరిజన సంఘం భవనంలో రైలే కాంట్రాక్టు కార్మికులతో జనరల్‌బాడీ సమావేశం యూనియన్ కార్యదర్శి సన్యాసిరావు జరిగింది. ముఖ్య అతిథిగా రైల్వేకాంట్రాక్టు వర్కర్సు అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరిసింహులు పాల్గొని మాట్లాడారు. ట్రాక్ మెయింటెనెన్స్ కార్మికులు, స్టేషన్‌లో పనిచేసే శానిటేషన్ వర్కర్లు, ఇతర పనులు చేసే వారికి రైల్వేబోర్డు జారీచేసిన జీవో ప్రకారం తప్పనిసరిగా కనీస వేతనాలు చెల్లించాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేకే లైన్లో పనిచేస్తున్న ట్రాక్ మెంటెనెన్స్ కార్మికులంతా వెనుకబడిన గిరిజనలేనని, వారి శ్రమను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నేతలు చిట్టిబాబు, దిలీప్, రాజు, అర్జున్, అశోక్‌కుమార్, అరున్ కుమార్ .రవీంద్ర, పూర్ణ తదితరులున్నారు.



పాడేరు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణను అభినందిస్తున్న నేతలు



చింతపల్లిలో చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అబ్బాయినాయుడు

ఘనంగా పాడేరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం

పాడేరురూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పాడేరు పీఏసీఎస్‌లో చైర్మన్‌గా డప్పోడి వెంకటరమణ(బుజ్జి), డైరెక్టర్లుగా మఱ్ఱి కొండబాబు, వంపూరు రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ రైతులకు చైర్‌పర్సన్లు, డైరెక్టర్లు సేవలందించాలన్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ నూతన చైర్‌పర్సన్ వెంకటరమణ మాట్లాడుతూ గిరిజన రైతుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. జనసేన పార్టీ నాయకుడు, జానపద కళల, సృజనాత్మక అకాడమీ చైర్మన్ వి.గంగులయ్య, పి.గోవిందరావు, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, వైస్‌ఎంపీపీ జి.శివకుమార్, కిముడు కళ్యాణం, రొబ్బి రాము, ఉషారాణి, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు

చింతపల్లిలో అబ్బాయినాయుడు బాధ్యతల స్వీకరణ

చింతపల్లి: స్థానిక ప్రాథమిక వ్యయసాయ కో ఆపరేటివ్ సొసైటీ (పీఏసీఎస్) చైర్‌పర్సన్‌గా గెమ్మెలి అబ్బాయినాయుడు బాధ్యతలు స్వీకరించారు. టీడీపీలో సీనియర్ కార్యకర్తగా పనిచేస్తున్న అబ్బాయినాయుడుని పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి సిఫారసు మేరకు ప్రభుత్వం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు గురువారం ట ఈశ్వరి, టీడీపీ నాయకుల సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.ఆయనతోపాటు డైరెక్టర్ సుర్ల అప్పలకొండ కూ డా విధుల్లో చేరారు. ఈసందర్భంగా నూతన పీఏసీఎస్ చైర్‌పర్సన్‌కి టీడీపీ నాయకులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి పోలుపర్తి గోవింద్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, ఏఎంసీ డైరెక్టర్లు గోలి దేవి, సత్యవతి, సేవా ఈశ్వరమ్మ, నాయకులు రీమల ఆనందరావు, కేశ్వరరావు, జీకేవీధి మండలాధ్యడు పోత్తూరు కొండలరావు, సర్పంచ్ సాగిన వరలక్ష్మి పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో సబ్ కలెక్టర్ పర్యటన



తోకరాయిలో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

సీలేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలంలోని శివారున తోకరాయి, నిమ్మచెట్టు గిరిజన గ్రామాలను పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ సందర్శించారు. గత ఏడాది కురిసిన వర్షాలకు మండలంలోని చట్రాపల్లితోపాటూ తోకరాయి, నిమ్మచెట్టు గ్రామాలపై కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో స్థానిక గిరిజనులు తీవ్రంగా నష్టపోయారు. ఈ స్థితిలో తాజాగా వర్షాలు కురవడంతో గిరిజనుల స్థితిగతులను తెలుసుకునేందుకు సబ్ కలెక్టర్ సందర్శించారు. ఆదివాసీలతో సబ్ కలెక్టర్ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధారకొండ సర్పంచ్ రాజు స్థానిక గిరిజనులకు సురక్షిత ప్రాంతాల్లో గృహాలను నిర్మించాలని సబ్ కలెక్టర్‌ని కోరారు. కమ్మరితోట, కొంగపాక లు, డి.కొత్తూరు, పెటిరాయి గ్రామాల పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. చిన్నగంగవరం, నిమ్మచెట్టు వంతెనలను నిర్మించాలన్నారు. సీలేరు ఏపీ జెన్‌కో నుంచి గుమ్మిరేవుల తదితర పంచాయతీలకు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. తహసీల్దార్ అన్నాజీరావు, వీఆర్వో సత్యనారాయణ, కార్యదర్శి రాజేశ్వరి పాల్గొన్నారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి: వైద్యాధికారి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): క్షయపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రూపశ్రీ అన్నారు. గురువారం క్షయ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రెండు వారాలపాటు దగ్గు, జ్వరం కలిగి ఉంటే కళ్లె పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, ఎర్రయమ్మ, ఎల్‌టీ కిశోర్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం: డ్వామా పీడీ



గిరిజన రైతులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ విద్యాసాగర్

గూడెంకొత్తవీధి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు ఉద్యాన పంటలను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ డాక్టర్ డీవీ విద్యాసాగర్ సూచించారు. గురువారం మండలంలోని రింతాడ పంచాయతీ ఈదులబంధ గ్రామంలో ఉద్యాన పంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26లో గిరిజన రైతులకు ఉచితంగా ఉపాధి పథకంలో ఉద్యాన పంటల మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రధానంగా గిరిజనులకు అధిక ఆదాయం సమకూర్చే జాఫ్రా, డ్రాగన్‌ఫ్రూట్, అవకడో, నేరేడు, మామిడి, మునగ తదితర 19 రకాల మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ మొక్కలు సాగుకు వీలుగా మూడేళ్లపాటు ప్రోత్సాహక నిధులు అందజేస్తున్నామన్నారు. మూడేళ్ల కష్టపడితే రైతులు దీర్ఘకాల ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ లాలం సీతయ్య, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వరారవు, ఏపీవో రాంప్రసాద్, ఈసీ రమణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు గరిష్ఠ వేతనం పొందేలా చూడాలి

కొయ్యూరు: ఉపాధి కూలీలు గరిష్ఠ వేతనం రూ.307 పొందే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ డాక్టర్ డీవీ విద్యాసాగర్ తెలిపారు. గురువారం మండలంలో ఉపాధి పథకం క్షేత్ర స్థాయి ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధి పనులను వేగవంతం చేయాలన్నారు. చింతపల్లి క్లస్టర్ ఏపీడీ లాలం సీతయ్య పాల్గొన్నారు.

డోలీలో గర్భిణీ తరలింపు



గర్భిణీను మోసుకువెళ్తున్న ఎర్రగొండ వాసులు

కొయ్యూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని యు. చీడిపాలెం పంచాయతీ ఎర్రగొండకు చెందిన గర్భిణీని డోలీ మోతతో ఆస్పత్రికి తరలించారు. కొర్రా శిరీష మూడో కాన్పుకు గానూ గురువారం ఉదయం పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే కుటుంబీకులు ఆశ వర్కర్ సీతమ్మకు సమాచారమందించారు. అలాగే, యు. చీడిపాలెం పీహెచ్‌సీ సిబ్బందికి ఈ విషయం వివరించారు. అయితే, ఎర్రగొండ గ్రామానికి అంబులెన్స్‌కు వెళ్లేందుకు రహదారి లేకపోవటంతో విధిలేక ఎర్రగొండకు సుమారు 3 కిలో మీటర్ల దూరంలోని వేమనపాలెంవరకు గామస్థులు మహేష్, పండన్న, రామకృష్ణ, భీమన్నల సహకారంతో భర్త శిరీషను తరలించారు. విషయం తెలుసుకున్న హెచ్‌వీ విజయకుమారి, ఎంపీహెచ్‌వో గంగరాజు వేమనపాలెం వద్దకు అంబులెన్సు తీసుకువెళ్లి అక్కడనుంచి వై. రామవరం సీహెచ్‌సీకు శిరీషను తరలించారు. ఎర్రగొండకు ఏడాది కిందట రోడ్డు నిర్మించారు. నాణ్యతా లోపంతో అది శిథిలావస్థకు చేరింది. ఈ స్థితిలో అత్యవసర పరిస్థితుల్లో డోలీ మోతలు తప్పని పరిస్థితి నెలకొందని, ఉన్నతాధికారులు స్పందించి రహదారి మరమ్మతులుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆదివాసీలు గంజాయి జోలికి వెళ్లొద్దు :ఏడీఏ

చింతపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):ఆదివాసీ రైతులు గంజాయి జోలికి వెళ్లకుండగా వ్యవసాయ పంటల సాగు చేపట్టాలని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) బీవీ తిరుమలరావు అన్నారు. గురువారం సబ్ డివిజన్ కేంద్రంలో మూడు మండలాల గ్రా మ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎంపీఈవోలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన గ్రామాలను గంజాయి రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి టి. మధుసూదనరావు, ఏఎస్‌వో రాంబాబు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ బకాయిలు చెల్లించక ఇక్కట్లు

అరకులోయ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్మన్ పథకం కింద పీవిటీజీలకు మంజూరైన ఇళ్లకు బకాయి బిల్లులు చెల్లించడంతోపాటు పెంచిన రూ. లక్ష లబ్ధిదారుల ఖాతాలకు జమచేయాలని సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చినబాబు డిమాండ్ చేశారు. గురువారం పెదగంగగుడి, సంగంవలస పీవీటీజీ గ్రామాలలో పర్యటించి నిలిచి పోయిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల్లో బాగా వెనుకబాటుకు గురైన పీవీటీజీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కా ఇళ్లను మంజూరు చేయడంతోపాటు ముందస్తుగానే రూ.70 వేలు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారన్నారు. అయితే, బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణం హౌసింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు.

కల్వర్టు గొయ్యిలో పడి గిరిజనుడి మృతి

జి.మాడుగుల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.కోడాపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారి అధికారులు కల్వర్టు నిర్మాణానికి తీసిన గొయ్యిలో పడి ప్రమాదవశాత్తు పడి ఓ గిరిజనుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. జాతీయ రహదారిలో భాగంగా కల్వర్టు నిర్మాణానికి కె.కోడాపల్లిలో గొయ్యి తీశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ గొయ్యి నీటితో నిండిపోయింది. ఈమార్గంలో ప్రయాణిస్తున్న గ్రామానికి చెందిన పలాసి సోమేశ్ అనే వ్యక్తి గొయ్యిలో జారిపడి మృతి చెందాడు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి: జడ్పీటీసీ సభ్యుడు

పెదబయలు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు భోజనం విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు కూడా బొంజుబాబు అన్నారు. గురువారం ఆయన సీతగుంట జడ్పీ హైస్కూల్, కళాశాల అలాగే ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర- 1 పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యు స్వర్ణలత, మాజీ సర్పంచ్ సింహచలం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ టోర్నమెంట్ మేనేజర్‌గా శివరామ్ ఎంపిక



చింతపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో 22,22తేదీల్లో నిర్వహించనున్న జోనల్ స్థాయి అథ్లెటిక్స్ టోర్నమెంట్ మేనేజర్‌గా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ కె.శివరామ్ కుమార్ ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి తెలిపారు. అలాగే ఈజోనల్ స్థాయి క్రీడల్లో కబడ్డీలో ఆడేందుకు కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పాంగి రమేశ్, లకే హరిచంద్ర, సాగిన చైతన్య ఎంపికయ్యారన్నారు.

గ్రామ సచివాలయం ఉద్యోగులకు సన్మానం



బదిలీపై వెళ్లిన సచివాలయం ఉద్యోగులతో ప్రజాప్రతినిధులు

జి.మాడుగుల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంజరి పంచాయతీ నుంచి పొరుగు మండలాలకు బదిలీపై వెళ్లిన గ్రామ సచివాలయ ఉద్యోగులను స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. గురువారం ఈమేరకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కొర్ర రవి, ఎంపీటీసీ సభ్యుడు వంతల మధు, మాజీ సర్పంచ్ సీతారాం నాయుడు, గిరిజన ఐక్యవేదిక జిల్లా సహాయక కార్యదర్శి మత్స్యరాజు, నాయకులు వెంకట రమణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం కావాలి

▸▸ టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని పార్టీ నియోజక వర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. గురువారం పార్టీ కార్యకర్తలు, ముఖ్యనాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంత అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించినట్టు చెప్పారు. గత వైసీపీ నిర్లక్ష్యంచేసిన అంజలి శనివారం పంచాయతీలో రూ.2.5కోట్ల తో బీటీ రోడ్డు నిర్మించినట్టు చెప్పారు. ప్రతి గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంతో రక్షిత మంచి నీటి పథకాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. ఆదివాసీలకు జిల్లాలో 35వేల పక్కా గృహాలు మంజూరు చేసినట్టు, ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉద్యాన పంట మొక్కలు ఉచితంగా అందిస్తున్నట్టు వివరించారు. గిరిజన రైతుల ప్రగతికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని లక్ష ఎకరాల్లో కాఫీ తోటల పెంపకానికి నిధులు కేటాయించారన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నట్టు చెప్పారు. ఈనెల 25న పాడేరులో నిర్వహించే స్త్రీశక్తి కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి పోలుపర్తి గోవింద్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, ఏఎంసీ డైరెక్టర్లు గోలి దేవి, సత్యవతి, సేవా ఈశ్వరమ్మ, నాయకులు రీమల ఆనందరావు, కేశ్వరరావు, జీకేవీధి మండలాధ్యడు పోత్తూరు కొండలరావు, గాంధీపడాల్, సర్పంచ్ సాగిన వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు ఇన్‌స్పైర్ వర్క్‌షాప్: డీఈవో



వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఇన్‌స్పైర్ వర్క్‌షాప్ ఎంతగానో దోహదపడుతుందని డీఈవో పి.బ్రహ్మాజీరావు అ న్నారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల తలారిసింగిలో పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకువేలి, అనంతగిరి, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో వివిధ యాజమాన్యాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులకు గురువారం నిర్వహించిన ఒక్క రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఈవో బ్రహ్మజీరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం ప్రాజెక్టు ఐడియాను రూపొందించి, దానితో సమాజానికి కలిగే ప్రయోజనాలను రూపొందించి వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. దీనికి 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. జిల్లా స్థాయిలో ఈ ఆలోచన ఎంపికైన విద్యార్థికి ప్రాజెక్టు రూ పొందించేందుకు రూ. 10 వేలు అందిస్తామన్నారు. జిల్లా సైన్స్ అధికారి టి.నాగేశ్వరరావు, ఏటీడబ్ల్యూవో అఖిల, లోచలిపుట్టు హెచ్ఎం. జీవీ ప్రసాదరావు పాల్గొన్నారు.

'లోకుల గాంధీని యువత ఆదర్శంగా తీసుకోవాలి'



శరభన్నపాలెంలో గాంధీ స్మారక స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కొయ్యూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత లోకుల గాంధీను యువత ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని వక్తలుపేర్కొన్నారు. లోకుల గాంధీ 4వ వర్థంతిని శరభన్నపాలెం గ్రామంలో కుటుంబీకులు, పార్టీ నేతలు, కార్యకర్తలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నడింపాలెం కూడలి వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి, గాంధీ స్మారక ప్రాంతంలోనూ గాంధీ విగ్రహాలకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న చిన్ని, డీవీడీ ప్రసాద్‌లకు లోకుల గాంధీ సేవా భూషణ్ అవార్డులిచ్చారు. సుమారు 100 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు అందచేశారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఐదుగురికి స్కాలర్‌షిప్‌లను అందచేశారు. ఈసందర్భంగా శరభన్నపాలెంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, ద్వారంపూడి పరమేశ్వరావు ప్రధాన కార్యదర్శి బి. నాగేశ్వరావు, అనకాపల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ పలక రవి, నర్సీపట్నం సంయోజక్ త్రినాద్, బాలలహక్కుల పరిరక్షణ జిల్లా అధ్యక్షురాలు చిన్ని, రంపచోడవరం ఏటీడబ్ల్యూవో శంబుడు, గొలుగొండ ఎంఈవో వంపూరి సత్యనారాయణ, టీడీపీ నేతలు దుచ్చరి చిట్టిబాబు, లోతా భీమరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు శివ, కార్యదర్శి పద్మరాజు, ధార్మిక సంస్థల ప్రతినిధి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణానికి మేలు

అరకులోయ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి కి పర్యావరణానికి హానికరం కాని మట్టి విగ్రహాలను పూజించాలని అరకులోయప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.భరత్‌కుమార్‌నాయక్ సూచించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, నాగబాబు, అనితకుమారి ల ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో పలువురు విద్యార్థులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్లాస్టరాఫ్‌పారిస్ చేసిన విగ్రహాలతో జలవనరులు కలుషితమవుతున్నాయన్నారు. విద్యార్థులు గ్రామాల్లో ఈ మేరకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై అంగన్‌వాడీల ఆందోళన




పాడేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న అంగన్‌వాడీలు

పాడేరురూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలు సమస్యలపై గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద గురువారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు, అంగన్‌వాడీల జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు చిన్నారి, అంబిక, దేవి, ఈశ్వరి, ఇందిర, మహలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్య లు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐసీడీఎస్ అధికారులకు వినతి పత్రం అందించారు. అనంతరం అంగన్‌వాడీలు ధర్నా చేశారు. సీఐటీయూ నేతలు శంకరరావు, త్రినాద్ పాల్గొన్నారు.

' అటవీశాఖ అధికారులపై దాడి తగదు'



నల్లబ్యాడీలతో విధులకు హాజరైన ఉద్యోగులు

చింతపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం అటవీ అధికారులపై దాడికి నిరసన ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. గురువారం డివిజన్ కార్యాలయంలో అటవీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నర్సీపట్నం యూనిట్ జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సింహాచలం మాట్లాడుతూ అటవీ అధికారులను దాడి చేసిన వ్యక్తులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈదాడిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించిన తీరు అభినందనీయమన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు కిరణ్, గోపి, బాబూరావు, సంధ్యారాణి, సన్యాసిరావు, సభ్యులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా... మూగజీవాలు మృత్యువాత



బోల్తా పడిన వ్యాన్



వ్యాన్ మీద పడటంతో మృతి చెందిన మూగజీవాలు

ముంచంగిపుట్టు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరడ పంచాయతీ అంటబొంగు సమీపంలో గల పేట్‌పుల్లైడ్ ఘాట్‌పై గురువారం మొక్కల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆ ప్రదేశంలో ఉన్న సుమారు 16 మూగజీవాలు వ్యాన్ కింద పడి మృత్యువాత పడ్డాయి. వివరాలివి.. ముంచంగిపుట్టు నుంచి బుంగాపుట్టుకు ఉపాధి పథకంలో భాగంగా మొక్కలను వ్యాన్‌లో తీసుకువెళతున్నారు. మార్గం మధ్యంలో ఘాటీ ఎక్కుతున్న సమయంలో ప్రమాదవశాత్తు వ్యాన్ అదు పుతప్పి బోల్తాపడింది. అదే సమయంలో అంటబొంగుకు చెందిన పలువురు తమ పశువులను మేతకు తీసుకువెళ్లి తిరిగి ఇళ్లకు తీసుకువస్తున్నారు. వాటిపై వ్యాన్ పడటంతో ఐదు ఆవులు, 11 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. మూగజీవాలు మృతి చెందిన నష్టపోయిన బాధితులకు పరిహారం అందించాలని గిరిజనసంఘం నే తలు వి.బారాజు, కె.లోహిత్, కె.కామేష్ డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై ముంచంగిపుట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువులపై రైతులు ఆందోళన చెందవద్దు

- జిల్లాకు మరో మూడు వేల టన్నులు కేటాయించాలని ప్రిన్సిపల్ కార్యదర్శిని కోరా
- ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే అధికారులకు ఫిర్యాదు చేయండి
- అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు


ప్రిన్సిపల్ కార్యదర్శితో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

నర్సీపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా వ్యాపారులు విక్రయిస్తే రైతులు అధికారులకు ఫిర్యాదులు చేయాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. నర్సీపట్నంలో యూరియా ఎరువు కొరతను గురువారం స్థానిక రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అయ్యన్న వెంటనే స్పందించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు, ముఖ్యమంత్రి కార్యాలయం ప్రిన్సిపల్ కార్యదర్శి, జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకు ప్రస్తుతం అధికారులు కేటాయించిన ఎరువుల కంటే మూడువేల టన్నులు కేటాయించాలని ప్రిన్సిపల్ కార్యదర్శిని కోరినట్లు తెలిపారు. స్థానిక వ్యాపారులు ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే తక్షణం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. రైతులు ఎరువులపై ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు.

బతికే ఉన్నాను.. రేషన్ కార్డు ఇవ్వండి సారూ..

- మాకవరపాలేనికి చెందిన రుత్తల రమణ మృతిచెందినట్టు గత వైసీపీ పాలనలో రికార్డుల్లో నమోదు
- నాటి నుంచి పథకాలకు, నిత్యావసర సరకులకు దూరం
- ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్నా అధికారులు తిరస్కరిస్తున్నారని బాధితుడు ఆవేదన


రుత్తల రమణ

మాకవరపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బతికుండగానే తనను గత వైసీపీ పాలనలో చనిపోయినట్టుగా చూపి ప్రభుత్వ పథకాలకు దూరం చేశారని ఓ వ్యక్తి కన్నీటి పర్యంతమయ్యారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మాకవరపాలెం గ్రామానికి చెందిన రుత్తల రమణతో పాటు తన కుమారుడుకి రేషన్ కార్డు ఉండేది. గత వైసీపీ ప్రభుత్వంలో 2020లో రమణ పేరును మరణించినట్టు నమోదు చేశారు. దీంతో అప్పటి నుంచి ప్రభుత్వ పథకాలతో పాటు రేషన్ సరకులను పొందలేకపోయారు. రేషన్‌కార్డు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఇదిలావుంటే, ప్రస్తుతం కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసినప్పటికీ రెవెన్యూ సిబ్బంది దరఖాస్తును తొలగించారని ఆయన ఆరోపించారు. దీనిపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి రేషన్ కార్డు మంజూరు చేయాలని ఆయన వేడుకుంటున్నాడు.

వినాయక విగ్రహాలు రెడీ

- చవితి వేడుకలకు సిద్ధం చేసిన కృష్ణాదేవిపేట కళాకారులు
- వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్న ఆది దేవుడు




కృష్ణాదేవిపేటలో కళాకారులు తయారుచేసిన వినాయక విగ్రహాలు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : చవితి వేడుకలు సమీపిస్తుండడంతో వినాయక విగ్రహాల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు. ఈనెల 27వ తేదీన బుధవారం వినాయక చవితి పండుగ జరగనుంది. ఈ పూజ కోసం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట (ఏఎల్‌పురం)లో గల తంగేటి అప్పలనర్సయ్య, భార్య వెంకటలక్ష్మి, తంగేటి శ్రీను, నాగమణి, దేవారపు శంకరరావు తదితర కళాశాలు వివిధ రూపాల్లో గణనాథుని విగ్రహాలు, ప్రతిమలను తయారు చేస్తున్నారు. గత పదిహేను సంవత్సరాలుగా వీరు ఇదే వృత్తిని కొనసాగిస్తున్నారు. ఆరు అంగుళాల నుంచి 12 అడుగుల వరకు భారీ విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఈ ఏడాది ముప్పై రూపాయల నుంచి ఇరవై వేల రూపాయలకు పైబడిన విగ్రహాలను విక్రయాలకు తయారు చేస్తున్నారు. ఈ విగ్రహాలను అనకాపల్లి జిల్లాతో పాటు విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ తదితర జిల్లాల నుంచి పలువురు వ్యాపారులు వచ్చి హోల్‌సేల్‌గా ఇక్కడ కొనుగోలు చేసి ఆయా ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. గత ఏడాది కంటే రంగుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలు పెరిగినట్లు కళాకారులు చెబుతున్నారు.

చవితి మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి : డీఎస్పీ


శ్రీనివాసరావు, డీఎస్పీ

నర్సీపట్నం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు మండపాల్లో మనుషులు లేకుండా దీపాలు వెలిగించి ఉంచరాదన్నారు. కనీసం ముగ్గురు వలంటీర్లు నిరంతరం మండపాలలో ఉండాలని సూచించారు. రహదారులకు అడ్డుగా నిలబడి చందాలు వసూలు చేయరాదన్నారు. మండపాలు పెట్టుకోవడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దీని కోసం ఎటు వంటి రుసుము చెల్లించ నవసరం లేదన్నారు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఊరేగింపులు, నిమజ్జనం సమయాల్లో సరైన లైటింగ్, పబ్లిక్ అడ్రాస్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధికారికంగా గుర్తించిన చెరువులు, నదులలో మాత్రమే విగ్రహాలు నిమజ్జనం చేయాలని స్పష్టం చేశారు. అత్యవసర సమయంలో 101కి ఫోన్‌చేయాలని సూచించారు. ఈ ఏడాది ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు.

ఘనంగా మరిడిమాంబ పండుగ


ఏఎల్‌పురంలో అమ్మవారి దర్శనానికి ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు



కృష్ణాదేవిపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం ఏఎల్ పురం, సీహెచ్.నాగాపురం, పల్లావూరు గ్రామాల్లో మరిడిమాంబ పండుగను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో అమ్మవారి ఆలయం వద్ద వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలను సమర్పించుకున్నారు. ఈ వేడుకలకు కృష్ణాదేవిపేట పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది. సాయంత్రం గ్రామాల్లో అమ్మవారి ఘటాలను, బోణాలను మేళతాళాలు, బాజా భజంత్రీల నడుమ ఊరేగించారు. రాత్రికి ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గొలుగొండ మాజీ జడ్పీటీసీ సభ్యులు చిటికెల తారకవేణుగోపాల్, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, టీడీపీ నాయకులు చిట్టిబాబు, బొడ్డు జమీలు, లగుడు రమేష్, అప్పలనాయుడు, సన్నిబాబు, బొప్పన ప్రసాద్, మారిడిమాంబ ఆలయ కమిటీ సభ్యులు, పలుపార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'ఓటు చోర్.. గద్దీ చోడ్' పేరిట కాంగ్రెస్ నిరసన

- బీజేపీ నైతిక బాధ్యత వహించాలని నేతల డిమాండ్



అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, తదితర నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : 'ఓటు చోర్ గడ్డి చోడ్' పేరిట పట్టణంలోని నెహ్రూచౌక్‌లో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం రాత్రి కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తులు చేతబట్టి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్ శాంతి నాగరాజు మాట్లాడుతూ దేశంలో వివిధ నియోజకవర్గాల్లో ఐదు విధాలుగా దొంగ ఓట్లను బీజేపీ ఓటర్ లిస్టులో చేర్పించిందని ఆరోపించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల తరువాత వివిధ రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గంపగుత్తగా దొంగ ఓటర్లను ఎలక్షన్ కమిషన్ చేతకానితనం వలన బీజేపీ విపరీతంగా చేర్పిందని మండిపడ్డారు. డీసీసీ అధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ నాశనం చేసిందన్నారు. దొంగ ఓట్లు ద్వారా గెలిచిన బీజేపీ వెంటనే నైతిక బాధ్యత వహించి ప్రధాని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ బొంతు రమణ, ఎలమంచిలి, పాయకరావుపేట, మాడుగుల, పెందుర్తి అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు తనకాల అనంతరావు, మారుతి చక్రవర్తి, పడాల కొండలరావు, విన్నకోట రాము, జిల్లా ప్రధాన కార్యదర్శులు కాళ్ళ సత్యనారాయణ, ఎం. రాహుల్, కె.వి.మాణిక్యం, బోయిన భానుమూర్తి యాదవ్, కత్తెర శ్రీధర్, వెంకటరమణ, సిద్ధాజి గున్నబాబు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.బాల మురళీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : పింఛన్ల పంపిణీ బాధ్యతలు తమకు అప్పగించవద్దంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం ఇక్కడి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో రమణబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, ఎఫ్‌ఆర్ఎస్ రద్దు చేయాలి, పెన్షన్ డ్యూటీ నుంచి మినహాయిపు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల అంగ్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీఎంకు ఆహ్వానం


సీఎం చంద్రబాబుకు ఆహ్వానపత్రం అందిస్తున్న వర్సిటీ పాలకమండలి సభ్యుడు

చోడవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీఎం చంద్రబాబునాయుడుకు ఆహ్వానించినట్టు యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు డాక్టర్ ముర్రు జయచంద్రనాయుడు గురువారం తెలిపారు. చీడికాడ మండలం తురువోలుకు చెం దిన జయచంద్రనాయుడు గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. హెల్త్ యూనివర్శిటీ వీసీతో పాటు, తాను బుధవారం సీఎం చంద్రబాబును కలిసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా వర్శిటీ స్నాతకోత్సవానికి ఆ హ్వానంతోపాటు, అమరావతిలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీకి స్థలం కేటాయించాలని కోరామన్నారు.యూనివర్సిటీ పాలకమండలి సభ్యు డిగా తనను నియమించినందుకుసీఎంకు కృతజ్ఞతలు తెలిపానన్నారు.

ఆటో డ్రైవర్లు ఆందోళన



రావికమతంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

రావికమతం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఉపాధి కోల్పోయిన తమకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. గురువారం పెద్ద ఎత్తున రాస్తారోకో చేపట్టారు. స్థానిక వినాయక ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ భారీగా రాలీ నిర్వహించిన అనంతరం తట్టబంద సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు.ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు కె. వరహాలునాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటోలపై ఆధారపడిన తామంతా ఉపాధి కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులకు వాహన మిత్ర ద్వారా ఏడాదికి రూ.25వేలు ఇవ్వాలని, వెల్ఫేర్ బోర్డు అమలు చేయాలని, డీజిల్‌పైన, ఆటో ఇన్సూరెన్స్‌పై టాక్స్‌లను తగ్గించాలని, సీఐటీయూ మండల కన్వీనర్ వజ్రపు సత్యవతి, ఆటో యూనియన్ కార్యదర్శి విరోధి సింహాచలం, ఉపాధ్యక్షుడు కె.అప్పలనాయుడు, పాల్గొన్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

రావికమతం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతికి కారకుడై పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసినట్టు కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ గురువారం తెలిపారు. 2016లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారన్నారు. ఆ కేసులో ముద్దాయి కర్ణాటకలోని బళ్లారికి చెందిన గుదసారవెల్లి బసవరెడ్డి పోలీసులను తప్పించుకుని తిరుగుతున్నాడని చెప్పారు. ఇన్నేళ్లకు అనంతపురం జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో మైనింగ్ క్వారీలో పనిచేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు అతడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. బసవరెడ్డిని గురువారం కోర్టులో ప్రవేశ పెట్టగా కోర్టు ఉత్తర్వుల మేరకురిమాండ్‌కు తరలించారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

. బుచ్చెయ్యపేట ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎల్‌బీ పురం, బంగారుమెట్ట గ్రామాలలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండుగ ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. వేకువ జామున నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఖండివరం హోమియో వైద్యశాలలో నిలిచిన సేవలు

- నెల రోజుల కిందట వైద్యాధికారి బదిలీ
- డిప్యూటేషన్‌పై వచ్చిన వైద్యుడు రాని వైనం .. రోగులకు తప్పని ఇబ్బందులు


వైద్యాధికారి లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

చీడికాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖండివరం హోమియో వైద్య కేంద్రానికి నెల రోజులుగా వైద్యాధికారి లేక రోగులు ఇబ్బందులు పడుతున్నట్టు గ్రామానికి చెందిన పెద్దలు సింగంపల్లి శ్రీనివాసరావు, కూండ్రపు గుణశేఖర్‌తో పాటు పలువురు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం ఈ హోమియోకేంద్రంను పరిశీలించగా, ఇక్కడ గతంలో పనిచేసిన వైద్యాధికారి నెల రోజుల క్రితం బదిలీ అయినట్టు తెలిసింది. అయితే, అధికారులు పూర్తిస్థాయి వైద్యాధికారిని నియమించకుండా ఎం.కోడూరు హోమియో కేంద్రంలో పనిచేస్తున్న వైద్యాధికారిని ఇక్కడ డిప్యుటేషన్‌పై నియమించారు. నెల రోజుల క్రితం ఈ వైద్య కేంద్రంలో చేరిన ఆమె ఆ తర్వాత ఒక్కసారి రాలేదని గ్రామ పెద్దలు ఆరోపిస్తున్నారు. గత వైద్యాధికారి ఉన్నపుడు ఖండివరంతోపాటు ఎల్‌బీ పట్నం, అప్పలరాజుపురం, బి.సింగవరం, వీరభద్రునిపేట, శిరిజాం, కోనాం పంచాయతీల నుంచి సుమారు 20గ్రామాలకు చెందిన సరాసరి 30నుంచి 40 మంది వరకూ రోగులు వచ్చేవారన్నారు. ప్రస్తుతం అటెండర్ మాత్రమే ఉన్నారని, దీంతో కేవలం ఐదునుంచి పది మంది రోగులకు పరిమితమైనట్టు వారు తెలిపారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయి వైద్యాధికారిని నియమించాలని కోరారు.

వెలుగు చూసిన ఉపాధి పనుల్లో అవకతవకలు


సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

బుచ్చెయ్యపేట, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలో వివిధ పంచాయతీల్లో చేపట్టి ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవలు గురువారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెలుగు చూశాయి. మండల కేంద్రంలో ఈ సభ నిర్వహించారు. మండలంలో 32 పంచాయతీల్లో రూ. 17 కోట్ల46 లక్షల 50వేలతో వివిధ శాఖల ద్వారా 1,310 పనులు చేపట్టారు. రాజాం గ్రామంలో యాదగిరి మాణిక్యం 36 రోజుల వేతనం రూ. 10,800, మోటూరి రవిబాబు 8 రోజుల వేతనం రూ. 2400, ఆర్ శివరాంపురంలో బోయిన భూలక్ష్మి రూ. 15,640లు పనుల్లో రాకుండా చెల్లించిన ట్లు తేలింది. వీఆర్‌పీ 2 రోజులు తన పేరున మస్టర్ వేసుకున్నట్టు గ్రామ ఉప సర్పంచ్ నాయుడు బాబు సభలో ఆరోపించారు. పలు గ్రామాల్లో దొంగ మస్టర్లతోపాటు ఆదిక వేతనాలు చెల్లించినట్టు గుర్తించారు. నీటి గుంతల నిర్మాణం, ఫిష్ పాండ్స్ నిర్మాణంలఅవినీతి జరిగినట్టు ఈ సభలో వెలుగుచూశాయి. కొబ్బరి మొక్కలు పెంపకంలో అవతకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ పూర్ణిమా దేవి, ఎస్. రవీంద్ర (విజిలెన్స్), ఏపీడీ బి. శ్రీనివాసరావు ఎస్‌టీఎం, ఎంపీడీవో భానోజీరావు, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, ఎంపీపీ డి.నాగేశ్వరి దేవి, వైస్ ఎంపీపీ డి. లలితానారాయణమూర్తి, దేవర అప్పారావు, ఏపీలో వరహలబాబుపాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి చేయాలని నిరసన

రావికమతం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): బురదమయంతో అధ్వానంగా మారినరింగ్ రోడ్డుపై పరిసర పది గ్రామాల గిరిజనులు గురువారం మొక్కలు నాటి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నేత కె.గోవిందరావు మాట్లాడుతూ, మండలంలో చినపాచిల- టి.అర్జాపురం పీఆర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న 14 కిలోమీటర్ల రింగ్ రోడ్డు బీటీ రోడ్డుకు 2023లో హై ఇంపాక్ట్ నిధులు కింద రూ.6.98 కోట్లు మంజూరయ్యాయన్నారు. 2024 జనవరిలో ఈ రోడ్డు పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ కొంత మేర పనులు చేపట్టి బిల్లులు చెల్లించలేదని వదిలేశారన్నారు. దీంతో జనాలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాడి బెన్నయ్య, వలసయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీడికాడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తురువోలు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ నమ్మి వెంకటరావు తెలిపారు. చీడికాడ, తు రువోలు, తంగుడుపల్లి, అర్జునగిరి, జి.కొత్తపల్లి, పెదగోగాడ, వరహాపురం, జెబి.పురం, తునివలస, చుక్కపల్లి, చెట్టుపల్లి వినియోగదారులు స హకరించాలని కోరారు.

రైవాడకు కొనసాగుతున్న వరద


నిండుకుండలా దర్శనమిస్తున్న రైవాడ జలాశయం

దేవరాపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైవాడ జలాశయం నుంచి వరుసగా మూడో రోజు కూడా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువనున్న ఏజెన్సీ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయానికి వరద నీరు పోటెత్తుతున్నది. గరిష్ఠ నీటి మట్టం 114 మీటర్లుకాగా.. ప్రాజెక్టు అధికారులు 113.5 మీటర్ల వద్ద నీటినిల్వలను క్రమబద్ధీకరిస్తూ అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గురు వారం 900 క్యూసెక్కుల వరద నీరు రిజర్వాయర్‌లోకి వస్తుండడంతో స్పిల్‌వే గేట్లను ఎత్తి 600 క్యూసెక్కుల నీటిని శారదా నదిలోకి విడిచిపెడుతున్నారు.

కోనాం సంతలో సీతాఫలాలకు ధర కరువు

చీడికాడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాంలో గురువారం జరిగిన సంతలో సీతాఫలాలకు గిట్టుబాటు ధర కరువయింది. కోనాం పాటు పాడేరు, అనంతగిరి, హుకుంపేట మండలాలకు చెందిన పలు గ్రామాల నుంచి గిరిజనులు ఈ ఫలాలను తీసుకువచ్చారు. సుమారు 300 చిన్న సీతాఫలాల బుట్ట రూ.700 నుంచి రూ.750 ధర మాత్రమే పలికాయి. ఈ వారం ఆశించిన స్థాయిలో వ్యాపారులు రాకపోవడంతో గిరిజనులు నిరాశతో స్వగ్రామాలకు వెళ్లిపోయారు.

పింఛన్ల పంపిణీ బాధ్యతలు తప్పించాలని నిరసన


చోడవరం మండల పరిషత్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

చోడవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ డ్యూటీల నుంచి తమను మినహాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. పింఛన్ల పంపిణీ బాధ్యతతో ప్రీస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల పింఛన్ల బాధ్యతల నుంచి తప్పించడంతో పాటు, ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు తమకూ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అనం తరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కొండమ్మ, ప్రమీలారాణి, పద్మ, లక్ష్మి, సీఐటీయూ నాయకులు శ్రీనివాసరావు, ఎస్‌పీ నాయుడు, గండి నాయనిబాబు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలో 32 పంచాయతీల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలపై తహసీల్దార్ ఎం. లక్ష్మి వినతిపత్రమిచ్చారు. అంగన్‌వాడీల అధ్యక్షురాలు పి.వరలక్ష్మి, వై. భానుమతి, జి.అమ్మాజీ, పి.ఈశ్వరమ్మ, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబాను దర్శించుకున్న టీడీపీ ఎమ్మెల్యేలు


కొమ్మలపూడిలో బాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గంటా, పల్లా, వంశీకృష్ణ

బుచ్చెయ్యపేట ఆగస్టు21(ఆంధ్రజ్యోతి) మండలంలోని కొమ్మలపూడిలో గురువారం ఇటీవల నిర్మించిన షిర్డీ సాయి బాబా ఆలయాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు,భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎమ్మెల్యే వంశీకృష్ణ దర్శించుకున్నారు. దొండపూడిలో జరుగుతున్న అమ్మవారి పండగకు వెళ్తున్న వీరు కొమ్మలపూడిలో ఆగి బాబాను దర్శించుకొన్నారు.ఈఆలయం నిర్మించిన గేదల సత్యనారా యణను అభినందించారు. వీరితో పాటు బుచ్చెయ్యపేట సహకార సంఘం అధ్యక్షులు డోంకిన అప్పలనాయుడు, గోకివాడ కోటేశ్వరరావు,నాయకులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఫలితాలు

చీడికాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏకాగ్రతతో ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఏపీ మోడల్‌స్కూల్స్ నిర్వహణ జోన్-1 మో నటరింగ్ అధికారి కృష్ణవేణి అన్నారు. మండలంలో మంచాల మోడల్ స్కూల్‌ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పుస్తకాలు, ఉపాధ్యాయుల రికార్డులు పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. హాస్టల్ గదులను పరిశీలించారు. పదవ, ఇంటర్ తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ బావిలో పడి యువకుడి మృతి

ఎలమంచిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక శేషగెడ్డ వద్ద నేల బావిలో చేపలు పట్టడానికి వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తూ అందులో పడి మృతి చెందాడని పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు. దీనికి సంబంధించి ఆమె తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కశింకోట మండలం నరసింగబిల్లి గ్రామానికి చెందిన కటారి రాజేశ్(23), అదే గ్రామానికి చెందిన మరో యువకుడితో కలిసి శేషగెడ్డ వద్ద నేల బావిలో చేపలు పట్టడానికి గేలాలతో వెళ్లారు. ఈ క్రమంలో రాజేశ్ ప్రమాదవశాత్తూ బావిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మృతిచెందాడు. ఇతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

శారదా నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

దేవరాపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమిరాం వద్ద శారదా నది వంతెన సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గురువారం ఉదయం స్థానికులు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బందితో వచ్చి, మృతదేహాన్ని ఒడ్డుకు చేర్పించారు. మృతిచెందిన మహిళ వయసు 50-55 ఏళ్లు వుంటాయని, కుడి చేతిపై 'జె.రాజులమ్మ' అని పచ్చ బొట్టు వుందని, ఎడమ చేతి మధ్య వేలుకు ఎరుపు రంగు పగడంతో కూడిన రాగి ఉంగరం ఉందని ఎస్ఐ చెప్పారు. ఆమెకు సంబంధించిన వారెవరైనా 94407 96092 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు.

60 కిలోల గంజాయితో ఎనిమిది మంది అరెస్టు

నర్సీపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం రూరల్ పోలీసులు గురువారం 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఒడిశా నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా నర్సీపట్నం మండలం రిట్టవానిపాలెం గ్రామ శివారులోకి గంజాయి తీసుకువచ్చినట్టు పోలీసులకు సమాచారం అందిందని చెప్పారు. దీంతో రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావు, గొలుగొండ ఎస్ఐ రామారావు, సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో నిఘా పెట్టారని పేర్కొన్నారు. గురువారం ఉదయం ఒక కారులో నుంచి మరో కారులోకి గంజాయి ప్యాకెట్లు ఎక్కిస్తుండగా పోలీసులు దాడిచేసి పట్టుకున్నారని, ఈ సందర్భంగా 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం రిప్పొన్‌పేట గ్రామానికి చెందిన మహమ్మద్ నిజాముద్దీన్, చిక్‌మంగళూరుకు చెందిన సంతోశ్, నయీం, గణేశ్‌బనాదారి, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం మేడూరు గ్రామానికి చెందిన వంతల బుజ్జిబాబు, చిన్నగెడ్డ గ్రామానికి చెందిన వంతల కార్తికేయ, కట్టుపొలం గ్రామానికి చెందిన రమేశ్, ఒడిశా రాష్ట్రం ఏనుగురాయి గ్రామానికి చెందిన హరిఖరన్‌లుగా గుర్తించి అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి రెండు కార్లు, ఒక బైక్, ఎనిమిది మొబైల్ ఫోన్లు సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు.

నదిలో గల్లంతైన రైతు మృతదేహం లభ్యం

రాంబిల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శారదా నదిని దాటుతూ నీటిలో గల్లంతైన రైతు మృతిచెందినట్టు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. మండలంలోని వైలోవ గ్రామానికి చెందిన రైతు బద్ది నారాయణరావు (61) బుధవారం శారదా నది అవతల ఉన్న పొలానికి వెళ్లి తిరిగి వస్తూ నదిలో కొట్టుకుపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సహకారంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో కొప్పుగొండుపాలెం సమీపంలోని వంతెన వద్ద మృతదేహం లభ్యమైంది.

రావికమతంలో చోరీ

» రూ.లక్ష నగదు, 50 తులాల వెండి వస్తువులు అపహరణ


చోరీ జరిగిన ఇంటి లోపల పరిశీలిస్తున్న పోలీసులు

రావికమతం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఒక ఇంటిలో గురువారం పట్టపగలు చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు లక్ష రూపాయల నగదు, 50 తులా వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఇందుకు సంబంధించి రావికమతం ఎస్ఐ ఎం. రఘువర్మ తెలిపిన వివరాలిలా వున్నాయి. రావికమ తంలోని గంజి వారి రామాలయం ఎదురుగా గంజి దేవి నివాసం వుంటున్నది. ఆమెతోపాటు కుటుంబ సభ్యులు గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చే సరికి తలుపులు తెరిచి వున్నాయి. ఆందోళన చెంది ఇంటిలోపలికి వెళ్లి చూడగా సామన్లు చిందరవందరగా పడివున్నాయి. ఇంటిలో భద్రపరుచుకున్న లక్ష రూపాయల నగదు, సుమారు 50 తులాల వెండి వస్తువులు కనిపించలేదు. చోరీ జరిగినట్టు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ, పోలీసు సిబ్బంది వెళ్లి పరిశీలించారు. గంజి దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రఘువర్మ తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	101.00
లైవ్ ధర	121.00
విత్ స్కిన్	212.00
స్కిన్ లెస్	222.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

భారీ చోరీని ఛేదించిన విశాఖ పోలీసులు

» జూలై 13న షీలానగర్‌లో 100 తులాల బంగారం, రూ.13.5 లక్షల దొంగతనం
» ఈ ఘటనలో ముగ్గురు నిందితుల అరెస్టు
» 72 తులాల బంగారం రూ.9.04 లక్షల నగదు స్వాధీనం


రికవరీ చేసిన బంగారు ఆభరణాలను చూపిస్తున్న డీసీపీ లతామాధురి

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర పరిధిలోని గాజువాక షీలానగర్‌లో సంచలనం సృష్టించిన 100 తులాల బంగారం, రూ.13.5 లక్షల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 72 తులాల బంగారం, రూ.9.04 లక్షల నగదును రికవరీ చేశారు. పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో క్రైమ్ డీసీపీ కె.లతామాధురి వివరాలు వెల్లడించారు.

షీలానగర్ వెంకటేశ్వర కాలనీలోని ఒక అపార్టుమెంట్‌లో నివసిస్తున్న దంపతులు జూలై 13న ఇంటికి తాళం వేసి కింద ఫ్లోర్‌లో ఉన్న తమ కుమార్తె ఇంట్లో నిద్రించారు. తెల్లవారుజామున ఇంటికి వెళ్లేసరికి తలుపులు బద్ధలుకొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే బీరువాలోని సుమారు 100 తులాల బంగారు ఆభరణాలు, రూ.13.5 లక్షల నగదు కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఆ బృందం సాంకేతిక ఆధారాలతో విశ్లేషణ చేసి నెల్లూరు జిల్లా కడవల మండలానికి చెందిన అర్జున్ జ్ఞానప్రకాశ్ (26), శ్రీకాకుళం జిల్లా గార మండలవాసి, ప్రస్తుతం నెల్లూరు జిల్లా మైపాడు మండలంలో ఉంటున్న లింగిబెడి రాంబాబు (30)ల హస్తం ఉన్నట్టు గుర్తించారు. వారిని తెలంగాణ రాష్ట్రం మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు. వారు నేరాన్ని అంగీకరించడంతో పాటు చోరీకి అసలు సూత్రధారి నర్సీపట్నం ప్రాంతానికి చెందిన చిటికల నాగేశ్వరావు అలియాస్ నగేశ్ (34)గా గుర్తించారు. అతడు గాజువాక బీసీ రోడ్డులో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 72 తులాల బంగారు ఆభరణాలు, రూ.9.04 లక్షల నగదును స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు.

కాగా నిందితుల్లో నాగేశ్వరరావుపై కాకినాడ, అనకాపల్లి, పశ్చిమ గోదావరి తదితర జిల్లాల్లో మొత్తం ఎనిమిది కేసులు ఉన్నట్టు గుర్తించారు. అర్జున్ జ్ఞానప్రకాశ్, రాంబాబుల మీద తెలంగాణలో ఒక మర్డర్ కేసుతో పాటు నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఐదుకు పైగా చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. నిందితుల మధ్య పాత పరిచయాలతో ముగ్గురూ కలిసి చోరీలకు పాల్పడుతుంటారని విచారణలో తేలిందని డీసీపీ వివరించారు.

వైద్య కళాశాల నిర్మాణ పనులు పునఃప్రారంభించాలి

» రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ

నర్సీపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం మండలంలో వైద్య కళాశాల నిర్మాణ పనులను పునఃప్రారంభించాలని గురువారం ఇక్కడ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శారదా నగర్‌లోని నవనిర్మాణ సమితిలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో తొలుత ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ మాట్లాడుతూ, ఏజెన్సీకి ముఖద్వారమైన నర్సీపట్నం నియోజకవర్గంలోని మాకవరపాలెం మండలంలో గత ప్రభుత్వం మొదలుపెట్టిన వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేయడం సరికాదని అన్నారు. ఇక్కడ వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని, మెడిసిన్ చదవాలనుకునే విద్యార్థులకు సీట్లు లభిస్తాయని అన్నారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ, వైద్య కళాశాల ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమంది ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్ అజయ్ స్రవంత్, విశ్రాంత ఆర్డీవో కనకరాజు, బొంతు గౌరునాయుడు, శివనారాయణరాజు, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దొండపూడిలో రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

రావికమతం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తన సొంతూరు దొండపూడిలో గ్రామ దేవత దుర్గాలమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా మహిళల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు, పురుషుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు, ఉభయులకు క్విజ్ పోటీలను గురువారం సాయంత్రం ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. మహిళల కబడ్డీ పోటీల్లో విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి తదితర జిల్లాల నుంచి పది జట్లు పాల్గొన్నాయి. పురుషుల వాలీబాల్ పోటీల్లో కడప, ఏటికొప్పాక, రాజమహేంద్రవరం, పి.మల్లంపేట, ఒంద్రువీధి, విశాఖపట్నం, పాడేరు, లంబసిగి, అనకాపల్లి, గుమ్మాళ్లపాడు, గవరవరం, కొత్తూరు, జైతవరం, దొండపూడి, చినపాచిల తదితర 20 టీమ్‌లు పాల్గొంటున్నాయి. పోటీలను తిలకించేందుకు భారీగా జనం తరలివచ్చారు.


మహిళ కబడ్డీ పోటీల్లో తలపడుతున్న అనకాపల్లి, వైజాగ్ జట్లు

50 శాతం రాయితీపై షేడ్ నెట్స్

సబ్బవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రక్షిత వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు షేడ్ నెట్స్‌ను ప్రభుత్వం 50 శాతం రాయితీపై ఇస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద్ నారాయణరావు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ అనిశ్చితి కారణంగా పంటలు దెబ్బతినకుండా షేడ్ నెట్స్ నిరోధిస్తాయన్నారు. పది సెంట్ల నుంచి ఎకరా భూమి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. పొలంలో బోరు వుండి, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు ఈ పథకానికి అర్హులుగా పేర్కొన్నారు. ఎకరా విస్తీర్ణంలో షేడ్‌నెట్స్ ఏర్పాటకు రూ.2,46,000 ఖర్చు అవుతుందని, ప్రభుత్వం బ 50 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు అకౌంట్ కలిగిన పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో, నేల, నీటి పరీక్షల నివేదికతో వెలుగు కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉప్పుటేరులో మత్స్యఘోష

... 5వ పేజీ తరువాయి

కురుస్తుండడంతో కంపెనీల్లో నుంచి విడుదల చేస్తున్న కాలుష్య రసాయన వ్యర్థాల కారణంగా చేపలు చనిపోతున్నాయని అన్నారు. గురువారం ఉప్పుటేరులో పెద్ద సంఖ్యలో చేపలు చనిపోయి, తీరానికి కొట్టుకువచ్చిన చోటుకు మత్స్యకార నాయకులు వెళ్లి పరిశీలించారు. ఈ సమస్యను గతంలో పలుమార్లు ఏపీఐఐసీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే సెజ్ ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మిడి అప్పారావు, ఉమ్మిడి జగన్, దేముడు, మహేష్, వై శ్రీను, అచ్చయ్య, పోలయ్య, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నలుగురికి శిక్ష ఖరారు

... 5వ పేజీ తరువాయి

గంజాయి తీసుకొచ్చి చీడికాడ మండలం కోనాం సమీపంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద వున్నారు. ఇక్కడి నుంచి మైదాన ప్రాంతానికి గంజాయి రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో అప్పటి ఎస్ఐ విశ్వనాథం ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్కడకు వెళ్లారు. పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద వున్న నాలుగు మూటల్లో ప్యాకింగ్ చేసిన 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు కేసు దర్యాప్తును పూర్తి చేసిన అనంతరం కోర్టులో నేరారోపణ అభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ యు.వెంకటరావు వాదనలను సమర్థంగా వినిపించడంతో నిందితులు నేరానికి పాల్పడినట్టు స్థానిక అదనపు జిల్లా జడ్జి హరినారాయణ నిర్ధారణకు వచ్చారు. నలుగురు ముద్దాయిలకు పదేళ్ల చొప్పున జైలు శిక్షతోపాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చారు.

గంజాయి రవాణాపై అప్రమత్తం

» కలకలం రేపిన 'ఆంధ్రజ్యోతి' కథనం
» అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో ఘటనలపై నిఘా వర్గాల ఆరా
» గంజాయి సాగు, రవాణాపై కఠినంగా వ్యవహరించాలని ఉన్నతాధికారుల ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



'ఆంధ్రజ్యోతి' కథనం క్లిప్పింగ్

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గంజాయి రవాణాపై పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఒడిశా నుంచి జిల్లా దాటి ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లోకి గంజాయి రవాణా జరుగుతున్న నేపథ్యంలో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'గంజాయి గుప్పు.. ఎవరిది తప్పు' శీర్షికన ప్రచురించిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. గంజాయి విషయంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించడంతో పాటు ఎక్కడా అవకతవకలు, లోటుపాట్లకు అవకాశం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. గంజాయి స్మగ్లర్లతో లింకులపై ఆరా తీయాలని, అందుకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి రహితం చేయాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా పటిష్ఠ చర్యలు చేపట్టడడంతో పాటు అందుకు విరుద్ధంగా వ్యవహరించే వారిపైనా కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల పరిధిలో గంజాయి సాగు, రవాణాకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరిస్తున్న వారిని గుర్తించాలని ఉన్నతాధికారులు నిఘా వర్గాలకు సూచించారు. ఈ క్రమంలో ఆ దిశగా నిఘా వర్గాలు చర్యలు చేపడుతున్నాయి. అలాగే స్మగ్లర్ల వాహనాలను వినియోగిస్తున్న పోలీసులకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నారు. అవసరమైన అన్ని చర్యలు చేపట్టి, గంజాయి రహితం దిశగా పక్కాగా చర్యలు చేపట్టాలని అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లోని పోలీసు యంత్రాంగానికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పర్యాటక ప్రదేశంగా పెద్ద చెరువు

... 5వ పేజీ తరువాయి

శంకుస్థాపన చేశారు. రూ.2.4 కోట్లతో చెరువు గట్టుకు కాంక్రీట్ రక్షణ గోడ, పంట పొలాల వైపు రాతికట్టు, బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. విద్యుత్ దీపాలు, చెరువు గట్టు మీద వాకింగ్ ట్రాక్, స్టీల్ రెయిలింగ్ వంటి పనులు మిగిలి పోయాయి. రాష్ట్ర పర్యాటక శాఖ మంజూరు చేసిన నిధులతో జాతీయ నేతలు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. పెద్ద చెరువు ప్రాంతంలో మిగిలిన అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఐదేళ్లపాటు ఇదే పరిస్థితి కొనసాగింది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతోపాటు అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం నుంచి మరోసారి ఎన్నికయ్యారు. అనంతరం శాసనసభ స్పీకర్‌గా ఎంపికయ్యారు. ఆయన చొరవతో ట్యాంక్ అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.4.5 కోట్లు మంజూరు చేసింది. లంబసింగి, చెరువులవేణం, కొత్తపల్లి జలపాతం, తదితర పర్యాటక ప్రదేశాలకు వెళ్లేవారు నర్సీపట్నం ట్యాంక్ బండ్ చూడడానికి వచ్చేలా సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులు ఆకాంక్షిస్తున్నారు. పార్కు, బోట్ షికారు, చిన్న పిల్లల ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్, స్వాతంత్ర్య సమర యోధులు, జాతీయ నేతల విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక ఆకర్షణగా చెరువు మధ్యలో భారీ విగ్రహం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

నేడు డీఎస్సీ మెరిట్ జాబితా

... 5వ పేజీ తరువాయి

పిలుస్తున్నారు. అంటే 1,139 మందిని పిలుస్తారు. ఒకవేళ ఒక అభ్యర్థి రెండు, మూడు పోస్టులు దక్కించుకునే మార్కులు సంపాదిస్తే ఒక పోస్టును మాత్రమే అతను ఎంపిక చేసుకోవాలి. అటువంటి సందర్భాలలో సదరు అభ్యర్థి తరువాత మార్కులు తెచ్చుకునే అభ్యర్థికి అవకాశం ఇస్తారు. ఇక్కడ కూడా రోస్టర్ పాయింట్లను పరిగణనలోకి తీసుకుంటారు. సర్టిఫికెట్ల పరిశీలన ముగిసిన తరువాత నియామక పత్రాలు అందజేస్తారు. దీనిపై స్పష్టత రావలసి ఉంది.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

నర్సీపట్నం నుంచి ట్రాలర్‌పై కాంక్రీట్ మిల్లర్‌ను తరలిస్తున్నారు. బొయితిలి సమీపంలోని గొందిపల్లి చర్చి వద్దకు వచ్చేసరికి ట్రాలర్‌పై ఉన్న కాంక్రీట్ మిల్లర్ విద్యుత్ తీగలకు తగడంతో తెగిపోయాయి. ఇవి ట్రాలర్ వెనుక బైక్‌పై వస్తున్న నర్సీపట్నానికి చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లపై పడడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. అయితే మృతుల వివరాలు తెలియాల్సి వుంది. బొయితిలి గ్రామస్థులు ఈ సంఘటనకు సంబంధించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కుమార్తెలపై అత్యాచారం కేసులో ముద్దాయికి 20 ఏళ్లు జైలు

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మైనర్లు అయిన ఇద్దరు కుమార్తెలపై అత్యాచారానికి పాల్పడిన తండ్రికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి గురువారం తీర్పు చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ అందించిన వివరాలిలా ఉన్నాయి.

ఒడిశా వాసి ఒకరు ఉపాధి కోసం కుటుంబంతో విశాఖ వలస వచ్చి ఆరిలోవ ప్రాంతంలో నివాసం ఉండేవాడు. అతడికి భార్య, 12, 8 ఏళ్ల వయసున్న కుమార్తెలు, అంతకంటే చిన్నవాడైన కుమారుడు ఉన్నారు. అతని భార్య ఆస్పత్రిలో పనిచేస్తుండేవారు. ఆమెకు తరచూ రాత్రి విధులు ఉండేవి. ఆమె లేని సమయంలో అతను తన ఇద్దరు కుమార్తెలపై లైంగికంగా దాడికి పాల్పడేవాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించేవాడు. రానురాను తండ్రి కిరాతకం పెరిగిపోవడంతో సహించలేని పెద్ద కుమార్తె విషయాన్ని పాఠశాల టీచర్‌కు చెప్పింది. బాలిక తల్లిని టీచర్ పిలిచి విషయాన్ని వివరించింది. కుమార్తెల ఇద్దరి నుంచి నిజం తెలుసుకున్న తల్లి గత ఏడాది సెప్టెంబరు 14న ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ ఇ.పెంటారావు కేసు నమోదుచేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. బాధిత బాలికలు ప్రభుత్వం నుంచి పరిహారం పొందవచ్చునని తీర్పులో పేర్కొంటూ ఇందుకు తగిన న్యాయ సహాయం అందించాలని న్యాయసేవా ప్రాధికార సంస్థకు సూచించారు.

గంజాయి స్మగ్లర్ల ఆస్తులు జప్తు

» ఎస్పీ అమిత్‌బర్దార్

పాడేరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాను గంజాయి రహితం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ అమిత్‌బర్దార్ తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో సైతం గంజాయి సాగు చేపట్టకుండా కట్టడి చేశామని, గంజాయి స్మగ్లర్లకు చెందిన రూ.3 కోట్ల 91 లక్షల ఆస్తులను జప్తు చేయడంతోపాటు 510 మందిపై హిస్టరీ షీట్‌లు తెరిచామన్నారు. గతంలో నేరాలకు పాల్పడిన వారిపైనా ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని, మళ్లీ గంజాయి జోలికి వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేస్తున్నామన్నారు.





